# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 211 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 29 జులై 2025


**ఇందిరమ్మ ఇండ్ల ముగ్గుల కార్యక్రమం**




**ములుగు పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్**






## రాష్ట్రంలో మీనాక్షి పాదయాత్రలు

**కార్యకర్తలతో కలిసి సమావేశాలు**

**జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు పర్యటనలు**

**హైదరాబాద్,28 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తన నియోజకవర్గ మిగతాది 2లో...

# విలువల రాజకీయాలకు ఆద్యుడు జైపాల్ రెడ్డి

**తెలంగాణ సాధనలో ఆయన పాత్ర అసామాన్యం**

**వర్ధంతి సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళి**

**నివాళి అర్పించిన మంత్రులు, పలువురు నేతలు**





**హైదరాబాద్,జులై 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ముద్దుబిడ్డ, విలువల విఖ్యాతకుడు ఎస్ జైపాల్ రెడ్డి అని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం నెక్లెస్ రోడ్ స్మృతి స్థలంలో ఎస్ జైపాల్ రెడ్డి ఆరవ వర్ధంతి సందర్భంగా ఆయన మెమోరియల్ వద్ద పుష్పగుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో జైపాల్ రెడ్డి పాత్ర ఎనలేనిదని అలాగే అభివృద్దే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా గణనీయమైన సేవలందించారని, ముఖ్యంగా యువతరానికి ఆయన ఆదర్శమని మిగతాది 2లో...




## ఫిడే ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌గా దివ్య

- అభినందించిన సిఎం రేవంత్ రెడ్డి

## తెలంగాణకు కొత్తగా నలుగురు జడ్జిలు




## గద్వాల పత్తి రైతులకు 700 కోట్ల బకాయిలు

**వెంటనే చెల్లించాలని విత్తన కంపెనీలకు ఆదేశం**

**నెలలుగా బకాయిల చెల్లింపులో ఆలసోయంపై ఆగ్రహం**

**మంత్రి జూపల్లితో కలసి సచివాయంలో తుమ్మల సమీక్ష**



**హైదరాబాద్,28(పిసిడబ్ల్యూ న్యూస్):** జోగులంబ గద్వాల జిల్లా పత్తి రైతులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను నెలలోగా చెల్లించాలని సీడ్స్ కంపెనీలను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశించారు. అన్ని కంపెనీలు కలిపి సుమారు రూ.700 కోట్లు– రైతులకు బకాయిలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రైతులు, వారిపై ఆధారపడిన రైతుకూలీలు ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, వారికి చెల్లించాలని బకాయిలను వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గద్వాల జిల్లా రైతులు సుమారు 50వేల ఎకరాల్లో పత్తి విత్తనాలను సాగు చేశారని, నెలల గడిచినా ఇప్పటి వరకు వారికి మిగతాది 2లో...

## ఆపరేషన్ సిందూర్ భారత్ సత్తాకు నిదర్శనం

**మన సైనిక సత్తాను ప్రపంచమంతా గుర్తించింది**

**ఉగ్రదాడికి ప్రతీకారంగానే ఉగ్రమూకలపై దాడి**

**పాక్ దాడిని ప్రతిదాడితో ఘోరంగా దెబ్బతీసాం**

**మన సైన్యం నిర్వహించిన పాత్ర అమోఘం**

**లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో రాజ్‌నాథ్ సింగ్**



**న్యూఢిల్లీ,జులై 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆపరేషన్ సిందూర్ భారత్ సత్తాకు నిదర్శనమని, మన వీరజవాన్ల పాత్ర వెలకట్ట లేనిదని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి మన సత్తా చాటామని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో సోమవారం ప్రత్యేక చర్చను రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో మిలటరీ యాక్షన్ చేపట్టింది. దీనిపై ప్రత్యేక చర్చలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొంటూ, కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ సిందూర్ పూర్తి చేశామని చెప్పారు. పహల్గాం దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని రాజ్‌నాథ్ ఆవేదన వ్యక్తం చేశారు.ఇందుకు ప్రతిగా పాక్ ఉగ్రవాద స్థావరాలపై వ్యూహాత్మకంగా మిగతాది 2లో...

## సిగాచీ మృతుల కుటుంబాలకు అందని సాయం

**కోటి పరిహారం ప్రకటించినా బాధితులకు దక్కలేదు**

**కుటుంబాలతో కలసి కలెక్టరేట్‌కు హరీశ్‌రావు నిరసన**



**సంగారెడ్డి,28 (పిసిడబ్ల్యూ న్యూస్):** సిగాచీ బాధిత కుటుంబాలకు ఇప్పటికీ పరిహారం అందలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిగాచీ ప్రమాద బాధిత కుటుంబాలకు న్యాయం మిగతాది 2లో...

## మోడీ కాదు... రాహుల్ కన్వర్టెడ్

**కులగణన అంతా తప్పుల తడక**

**రాబోయే ఎన్నికల్లో బిసిలకు పెద్దపీట వేస్తాం**

**మీడియా సమావేశంలో బిజెపి అధ్యక్షుడు రామ్**



**హైదరాబాద్,జులై 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** మోడీని న్వర్టె డ్ బీసీ అని సిఎం రేవంత్ విమర్శలు చేయ డంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ కన్వర్ట్ అయ్యారు.. మోడీ కాదు అని ఆయన విమర్శించారు. కేసీఆర్ గతంలో ఎంబీసీ చైర్మన్ పెట్టి రూ.1000 కోట్లు– కేటాయిస్తామన్నారు.. కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, కేసీఆర్.. సమగ్ర కుల సర్వే చేశాడు.. కానీ నివేదిక బయటపెట్టలేదన్నారు. తెలంగాణలో బీసీలు 52 శాతానికి పైగా ఉన్నారని, కులగణన కొన్ని మండలాల్లో జరగనే లేదు.. ఎలా పూర్తిచేశారన్నారు. నిజంగానే రాష్ట్ర ప్రభుత్వం చేస్తే నిజాలు ఎందుకు బయపెట్టడంలేదని, అందుకే కేంద్ర ప్రభుత్వం జన గణనతో పాటు– కుల గణన కూడా చేపట్టనుందన్నారు. అందులో వాస్తవాలు చెప్పి దాని ప్రకారం సంక్షేమ పథకాలు ఇంప్లిమెంట్ చేస్తామని, రాజ్యాంగం మారుస్తారని, ఎస్సీలకు రిజర్వేషన్లు ఎత్తేస్తారని అమిత్ షా మాట్లాడినట్లు– కాంగ్రెస్ సృష్టించిందన్నారు రాంచందర్ రావు. ఈ కేసు సీఎంపైనే ఉందని, రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఇచ్చినా ఇవ్వకున్నా.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట మిగతాది 2లో...



## పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

**గతేడాది పోలిస్తే పెరిగిన వినియోగం**

**సరఫరాలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

**వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్**

**హైదరాబాద్,జులై 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** గతేడాదితో పోల్చుకుంటే ఈ వర్షాకాలంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతున్నదని, రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశమున్నందున విద్యుత్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ మిగతాది 2లో...

## ఆత్మహత్యకు పాల్పడబోయిన యువకుడు

**మాటల్లో పెట్టి కాపడిన హైడ్రా సిబ్బంది**

**అభినందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్**



**హైదరాబాద్,28 (పిసిడబ్ల్యూ న్యూస్):** దుర్గంచెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని చాకచక్యంగా కాపాడిన హైడ్రా డీఆర్‌ఎఫ్ సిబ్బంది తిరుపతియాదవ్, సంతోష్‌చారి, మహ్మద్ ఇమ్రాన్‌లను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అభినందించారు. ఈ నెల 25న రామిరెడ్డి అనే యువకుడు దుర్గం చెరువు తీగల వంతెన మిగతాది 2లో...

# రాష్ట్రంలో మీనాక్షి పాదయాత్రలు

(మొదటి పేజీ తరువాయి)

పర్యటనలో భాగంగా పాదయాత్రలను ప్రారంభించబోతున్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు వివిధ నియోజకవర్గాల్లో పాదయాత్రలు, శ్రమదానం కార్యక్రమాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నట్లు- పార్టీ వర్గాలు వెల్లడించాయి.పాదయాత్రల షెడ్యూల్ ప్రకారం, జూలై 31న పరిగి పట్టణంలో సాయంత్రం పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ పాదయాత్ర అనంతరం పరిగిలో రాత్రి బస చేయనున్నారు. ఆగస్టు 1న ఉదయం శ్రమదానం కార్యక్రమంలో పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం ఆందోల్ నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తారు.ఆగస్టు 2న శ్రమదానం కార్యక్రమంతోపాటు- కార్యకర్తల సమావేశం ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు ఆర్మూరు లో పాదయాత్ర చేపడతారు. ఆగస్టు 3న ఉదయం శ్రమదానం నిర్వహించి, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఖానాపూర్ లో పాదయాత్ర ఉంటు-ంది.ఆగస్టు 4న ఉదయం శ్రమదానం అనంతరం కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం చొప్పదండి లో పాదయాత్ర చేసి రాత్రి బస చేస్తారు. ఆగస్టు 5న ఉదయం శ్రమదానం అనంతరం సమావేశం నిర్వహించి, సాయంత్రం వర్ధన్నపేట లో పాదయాత్ర చేపడతారు. చివరిగా ఆగస్టు 6న శ్రమదానం, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పాదయాత్రలను ముగిస్తారు.

# ఫిడే ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌గా దివ్య

● అభినందించిన సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,జులై 28(పిసిడబ్ల్యు న్యూస్):** ఫిడే ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌గా అవతరించిన దివ్య దేశ్‌ముఖ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా సిఎం రేవంత్ పోస్టు పెట్టారు. దివ్య దేశ్‌ముఖ్ తోటి భారతీయ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపితో తలపడి ప్రతిష్టాత్మక -టైటిల్‌ను సాధించడం చాలా గొప్ప విషయమని, ఇద్దరూ కలిసి దేశం గర్వపడేలా చేశారని ఆయన కొనియాడారు. సెమీ-ఫైనల్స్‌లో ప్రపంచ స్థాయి ప్రత్యర్థులను ఓడించి, మన సత్తా ఏంటో చూపించారని ఆయన ప్రశంసించారు. సరైన అవకాశాలు లభించినప్పుడు మహిళలు ఎంత ఎత్తుకు ఎదగగలరో నిరూపించారని ఆయన తెలిపారు. మీ ప్రయాణం ఎంతో మందిలో స్ఫూర్తి నింపుతుందని, దివ్య దేశ్‌ముఖ్ , కోనేరు హంపిలు ఇద్దరూ రాబోయే రోజుల్లో మరిన్ని గొప్ప విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కాగా, ఫైనల్స్‌లో వీరిద్దరి మధ్య జరిగిన తొలి ర్యాపిడ్ -టై బ్రేకర్ డ్రాగా ముగియగా రెండో గేమ్‌లో మొత్తం 75 ఎత్తుల్లో దివ్య విజయం సాధించారు. 2025 ఫిడే మహిళల ప్రపంచ కప్ ఫైనల్స్‌కు చేరిన తొలి క్రీడాకారిణిగా ఆమె నిలిచిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే టోర్నీలో విజేతగా ఆవిర్భవించడం విశేషం.

# తెలంగాణకు కొత్తగా నలుగురు జడ్జిలు




**హైదరాబాద్,జులై 28(పిసిడబ్ల్యు న్యూస్):** తెలంగాణ హైకోర్టుకు మరో నలుగురు కొత్త జడ్జిలు రానున్నారు. దేశవ్యాప్తంగా పలు హైకోర్టులకు సోమవారం 19మంది జడ్జీలు, అదనపు జడ్జీలు నియమితులయ్యారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కోలీజియం సిఫారసులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. వీరి నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో న్యాయ మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. కాగా, 19 మందిలో తెలంగాణ హైకోర్టుకు నలుగురు జడ్జీలను నియమించారు. గాడి ప్రవీణ్‌కుమార్, చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గౌస్ మీరా మొహుద్దీన్ లు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణం చేయనున్నారు. తెలంగాణతోపాటు- మధ్యప్రదేశ్ హైకోర్టుకు ఏడుగురు జడ్జీలు, నలుగురు అదనపు జడ్జీలు.. ఇక, అస్సాం హైకోర్టుకు నలుగురు జడ్జీలను నియమితులయ్యారు.


# గద్వాల పత్తి రైతులకు 700 కోట్ల బకాయిలు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధిత కంపెనీలు చెల్లింపులు చేయలేదని స్థానిక ఎంఎల్ఏ కృష్ణామోహన్‌రెడ్డి ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా సహించేది లేదని మంత్రి స్పష్టం చేశారు.గద్వాల జిల్లా రైతాంగం పత్తి విత్తనాల ఉత్పత్తిలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, దేశానికి తలమానికమని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. విత్తన ఉత్పత్తి చేసి కంపెనీలకు అందిస్తే ఆయా కంపెనీలు రైతులకు ఇప్పటి వరకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించకపోవడం విచారకరమని అన్నారు. ఇప్పటికైనా ఆయా కంపెనీలు తక్షణమే స్పందించి నెలరోజుల్లోగా ఉన్న బకాయిలను రైతులకు చెల్లించి వారిని ఆదుకోవాలని కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా లాంటి కార్యక్రమాలతో రాష్ట్ర రైతాంగానికి వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. వేల కోట్ల రూపాయలు రైతులకు ఇచ్చి ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకుంటు-ందన్నారు. రైతులకు లాభం, సౌకర్యం, సంక్షేమం మా ప్రాధాన్యమని మంత్రి అన్నారు. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎంఎల్ఏ కృష్ణామోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపిలు పలు సీడ్ కంపెనీ ప్రతినిధులతో సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర సీడ్స్ మెన్ అసోసియేషన్ ప్రతినిధులు రామకృష్ణ, ప్రవీణ్, వివిధ కంపెనీల ప్రతినిధులు, రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

# మోడీ కాదు...రాహుల్ కన్వర్టెడ్

(మొదటి పేజీ తరువాయి)



వేస్తామని, 42 శాతం పక్కాగా ఓన్లీ బీసీలకే ఇస్తామన్నారు. కాంగ్రెస్ చెబుతున్నట్లుగా వాటిలో కూడా 10 శాతం ముస్లింలకు ఇవ్వబోమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, బీసీలకు లబ్ధి చేకూర్చేలా కేంద్రం ముందుకు వెళ్తుంటే తమకు నష్టమని భావించి కాంగ్రెస్ దుష్ప్రచారాలకు దిగుతోందని ఆయన మండిపడ్డారు. ఎలక్షన్స్ ముందు సీఎం రేవంత్ ఇచ్చిన స్టేట్ మెంట్లు బయటపెడతాం.. ఆయన ఏం మాట్లాడాడో బయటపెడతామని ఆయన వ్యాఖ్యానించారు.బీసీల సంక్షేమంపై కాంగ్రెస్ చేసేదంతా యాక్టింగే అని, వచ్చేనెల 2వ తేదీన ధర్నా చౌక్ వద్ద బీసీ రిజర్వేషన్లపై మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. బీసీల సంక్షేమం గురించి ఆలోచించే పార్టీ బీజేపీ మాత్రమే అని, కాంగ్రెస్ కేవలం ఓట్ల కోసమే ఆలోచిస్తుంది.. కానీ బీజేపీ ప్రజా సంక్షేమం గురించి ఆలోచిస్తుందన్నారు రాంచందర్ రావు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడంలో బీసీల పాత్ర కీలకం.. వారికి అంతేస్థాయిలో ప్రయారిటీ- ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

# విలువల రాజకీయాలకు ఆద్యుడు జైపాల్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. విద్యార్థిదశ నుండి ఒక లీడర్‌గా, కేంద్ర మంత్రిగా అందించిన మహనీయ సేవలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. అజాతశత్రువు కీర్తిశేషులు ఎస్ జైపాల్ రెడ్డి అని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. స్మృతి స్థల్ లో పుష్ప గుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర మంత్రి, ఎంపీ, రాజ్యసభ సభ్యులుగా ఎన్నో సేవలు అందించారని హైదరాబాద్ మెట్రో, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కి ఎంతో కృషి చేశారని అలాగే కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణలో వివిధ అభివృద్ధి పనులకు పదివేల కోట్ల రూపాయలు అలాగే నల్గొండ జిల్లాకు 400 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని అన్నారు. విశిష్ట సేవలు అందించిన వ్యక్తిగా జైపాల్ రెడ్డి ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారతరత్న అందించాలని అన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ జైపాల్ రెడ్డి ప్రజా సేవకు నిలువెత్తు సాక్ష్యం అని, తెలంగాణ రాష్ట్ర అవతరణలో ఆయన పాత్ర కీలకమని అన్నారు. స్టూడెంట్ లీడర్ గా, కేంద్ర మంత్రిగా అటు దేశానికి ఇటు తెలంగాణకు ఎన్నో విలువైన సేవలు అందించారని విలువలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చే వారని, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు అందుకోవటం ఆయన గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. రాజకీయాల్లో మచ్చలేని మనిషిగా ఎదిగారని నేటి తరం ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. స్వర్గీయ జైపాల్ రెడ్డి కుటుంబాన్ని శాసనసభ స్పీకర్, శాసనమండలి ఛైర్మన్, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు పరామర్శించారు.స్మృతి స్థల్ లో మాజీ కేంద్రమంత్రి కీర్తిశేషులు ఎస్ జైపాల్ రెడ్డి ఘాట్ నందు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ సలహాదారులు కేశవ రావు, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి, తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి, బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, మాజీ మంత్రులు సంబాని చంద్రశేఖర్, మాజీ ఎంపీలు హనుమంతరావు, రవీంద్ర నాయక్, మధు యాష్కీ గౌడ్ ఎమ్మార్పీ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, స్వర్గీయ జయపాల్ రెడ్డి కుటు-ంబ సభ్యులు, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, పుర ప్రముఖులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు వర్ధంతి సందర్భంగా ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. జైపాల్ రెడ్డి మెమోరియల్ వద్ద శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, గడ్డం వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, ఇతర ప్రముఖులు నివాళులు అర్పించారు. జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను నేతలు పరామర్శించారు.

# ఆపరేషన్ సిందూర్ భారత్ సత్తాకు నిదర్శనం

(మొదటి పేజీ తరువాయి)

దాడి చేశామని, 9 ఉగ్ర శిబిరాలను భారత సైన్యం ధ్వంసం చేసిందని, 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టు-బెట్టిందని సభకు తెలిపారు. పాక్‌లో సామాన్యులకు ఇబ్బంది లేకుండా దాడులు చేశామన్నారు. సిందూర్ అనేది వీరత్వం, శౌర్యానికి ప్రతీక అని అభివర్ణించారు. ఉగ్రవాద శిబిరాలు, వారి మద్దతుదారులను లక్ష్యంగా చేసుకుని వారిని మట్టు-బెట్టడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టామని అన్నారు. ఆత్మరక్షణ కోసమే సైనిక చర్య తీసుకున్నామని, రెచ్చగొట్టడానికో, విస్తరణవాదంతోనే కాదన్నారు.మే 10వ తేదీన సుమారు 1.30 గంటలకు కూడా ఇండియాపై క్షిపణలు, డ్రోన్లు, రాకెట్లు-, ఇతర సుదీర్ఘ శ్రేణి ఆయుధాలపై దాడులకు పాక్ తెగబడిందని చెప్పారు ఎస్-400, ఆకాశ్ మిజైల్ సిస్టమ్ పూర్తిగా పాక్ దాడులను విఫలం చేశాయని అన్నారు. పాకిస్థాన్‌లోని పలు వైమానిక కేంద్రాలపై భారత వాయిసేన భీకరంగా విరుచుకు పడటంతో పాకిస్థాన్ ఓటమిని అంగీకరించి కాల్పుల విరమణ ప్రతిపాదన చేసిందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు విరామం ఇచ్చేందుకు కేవియట్‌తో ఆమోదించామని తెలిపారు. భవిష్యత్తులో పాక్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా ఆపరేషన్ తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు. ముందుగా నిర్ణయించిన రాజకీయ, మిలటరీ లక్ష్యాలు నెరవేరడంతో ఆపరేషన్ సింధూర్‌కు విరామం ఇచ్చిందని, ఒత్తిళ్ల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామనేదే పూర్తిగా తప్పని వివరించారు. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ అబద్ధం చెప్పకుండా ఉండేందుకే తాను ప్రయత్నించానని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో ఎన్ని విమానాలు కూలిపోయాయంటూ కొందరు విపక్ష సభ్యులు ప్రశ్నించారని, అయితే ఆ ప్రశ్న మన జాతీయ భావోద్వేగాలకు ప్రతిబింబించేదిగా లేదని తాను భావిస్తున్నానని రాజ్‌నాథ్ చెప్పారు. రాజ్‌నాథ్ ప్రసంగిస్తున్న సేపు అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు. పహల్గాంలో ఉగ్రదాడి హేయమైన చర్య అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మతం పేరు అడిగి మరీ పర్యాటకులను కాల్చి చంపారన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు భారత సైనికులు చాలా జాగ్రత్తలు తీసుకున్నారని, పాకిస్థాన్‌లోని సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాడులు జరిపారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని గట్టిగా చెబుతున్నాం. ఇలాంటి ఆపరేషన్లు జరిగినప్పుడు చిన్న చిన్న విషయాలు పట్టించుకో కూడదు. 40 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నా.. ఇలాంటి ప్రశ్నలు ఎప్పుడూ వినలేదు. ఇలాంటి విషయాల్లో ఆచితూచి, ఆలోచించి ప్రశ్నలు అడగాలన్నారు. 1962లో చైనాతో యుద్ధం జరిగినప్పుడు విపక్షాలు ఎలాంటి ప్రశ్నలు వేశాయో తెలుసుకోవాలి. ఆనాడు విపక్షాలు భారత భూభాగం, మన సైనికుల పరిస్థితి గురించి ప్రశ్నించాయి. మన సైనికుల చర్యను వాజ్‌పేయీ ప్రశంసించారు. 1999లో శాంతియుత పరిస్థితిని కోరుతూ వాజ్‌పేయీ లాహోర్ యాత్ర చేపట్టారు. పాకిస్థాన్‌తో భారత్ స్నేహం కోరుకుంటోందని ఆనాడు వాజ్‌పేయీ చెప్పారు. స్నేహ హస్తం చాచడమే భారత్ గొప్పతనం. ఆనాడు వాజ్‌పేయీ తీవ్ర నిర్ణయం తీసుకుంటే పాక్ మర్నాడు సూర్యోదయం చూసేది కాదు. శాంతి కోరడం భారత్ రక్తంలోనే ఉంది. యుద్ధాలు కోరుకోం. ప్రతి విషయాన్ని మానవత్వ కోణంలో ఆలోచిస్తాం. తుపాకులు పేలితే ఎవరూ మిగలరని అన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాకిస్థాన్ అధికారులు పాల్గొన్నారు. దీనిని బట్టి వారిని ఆ దేశం ఎలా పెంచి పోషిస్తుందో స్పష్టంగా తెలుస్తోంది.మనం ఎవరిపైనా దాడి చేయలేదు. పాకిస్థాన్ చరిత్ర, అక్కడి ఉగ్రవాదం గురించి తెలుసుకొని మాట్లాడాలి. మనిషి.. నీతి, నిజాయతీతో బతకాలని తులసీదాస్ దోహాలో చెప్పారు. భారత స్నేహహస్తాన్ని పాక్ అందుకోలేకపోయింది. మనదేశ ప్రజలను చంపుతుంటే సైన్యం చూస్తూ ఊరుకోదు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం.. ఆ దేశానికే ఇబ్బందిగా మారుతుందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

# సిగాచీ మృతుల కుటుంబాలకు అందని సాయం

(మొదటి పేజీ తరువాయి)

చేయాలంటూ ఆయన సంగారెడ్డి అదనపు కలెక్టర్‌ను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సిగాచీ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇప్పిస్తామని సీఎం చెప్పారు. రోజులు గడుస్తున్నా.. ఎవరూ పట్టించు కోవడం లేదు. పరిహారం అందలేదని బాధిత కుటు-ంబసభ్యులు ఆందోళనలో ఉన్నారు. ఎప్పుడు పరిహారం ఇస్తారని నిలదీస్తున్నారు. పరిహారం కోసం అధికారులను కలిస్తే నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారు. కొన్ని కుటు-ంబాలకు రూ.లక్ష పరిహారమే అందింది. మృతులు, క్షతగాత్రుల వివరాలు ఇంకా అధికారికంగా ప్రకటించ లేదు. ఎంత మందికి పరిహారం ఇచ్చారో అధికారికంగా చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సిగాచీ పరిశ్రమలో పేలుళ్లు సంభవించి 54 మంది మరణించారని, ఈ దుర్ఘటన జరిగి నెలరోజు లైనా బాధిత కుటుంబాలకు పరిహారం అందలేదని హరీశ్ రావు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం బాధిత కుటుంబాలతో కలిసి ఆయన సంగారెడ్డి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అక్కడ అడిషనల్ కలెక్టర్‌ను కలిసి.. బాధిత కుటు-ంబాలకు మృతదేహాలను అందించడంలో, పరిహారం అందించడంలో ప్రభుత్వ వైఫల్యంపై నిలదీశారు. ఆ తర్వాత హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ.. 'సిగాచి ఘటన జరిగి నెల రోజులు కావొస్తున్నది. బాధిత కుటుంబాలు కన్నీళ్ల మధ్య నెలమాసికాలు చేసుకుంటు-న్నారు. చనిపోయినవారి పేర్లు, ఎవరెవరికి ఎంత ఇచ్చారు, క్షతగాత్రులకు ఎంత ఇచ్చారు అనేది ఈ ప్రభుత్వం ఎందుకు దాచి పెడుతున్నది..? ఇప్పటివరకు నష్టపరిహారం వివరాలు వెల్లడించకుండా ఎందుకు గోప్యంగా ఉంచారో సమాధానం చెప్పాలన్నారు.అసలు ఈ సిగాచీ ప్రమాదం ఎలా జరిగిందో ఎందుకు బయట పెట్టడంలేదన్నారు. అందరికీ డెత్ సర్టిఫికెట్, పంచనామా కాపీ, ఎఫ్ఐఆర్ కాపీలు ఒక ఫోల్డర్‌లో పెట్టి కుటుంబ సభ్యులకు ఇవ్వాలన్నారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవడంలో రేవంత్ ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న వారికైనా మంచి వైద్యం అందించాలన్నారు. ఎస్ఎల్బీసీ ఘటన జరిగితే సమన్వయం చేయలేదు. సొరంగం భవిష్యత్తు ప్రశ్నార్థకం అయ్యింది. ఎస్ఎల్బీసీలో ఆరు శవాలు, సిగాచిలో 8 మంది శవాలు మొత్తం 14 శవాలు ఏమయ్యాయి..? మిస్సింగ్ అని ఎలా తప్పించు కుంటారు..? బాధితుల గోస వినపడటం లేదా..? సీఎం ఇలాంటి విషయంలో బాధ్యతారాహిత్యంగా ఉండటం సరికాదు. ఇప్పటి-కై-నా కళ్ళు తెరువాలి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే బీఆర్ఎస్ తరఫున పోరాటం తీవ్రతరం చేస్తాం అని హరీశ్‌రావు హెచ్చరించారు.

# పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ అధికారులతో ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మిట్టల్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి విద్యుత్ శాఖకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, విద్యుత్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పారిశ్రామిక, వాణిజ్య రంగాలతో పాటు గృహ రంగంలో కూడా భారీ వినియోగం నమోదవుతుంది. దీనికి తోడు, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందుబాటులో ఉండటంతో లక్షలాది మోటర్లు నిరంతరం నడుస్తున్నాయి. ఫలితంగా వర్షాల సీజన్‌లో కూడా భారీగా డిమాండ్ నమోదవుతున్నది. గతేడాదిజులై 31 న 13541 మెగావాట్లుగా నమోదయిన గరిష్ట డిమాండ్ ఈ ఏడాది జులై 16న 14.05 శాతం పెరుగుదలతో 15443 మెగావాట్లు-గా నమోదయ్యిందన్నారు. పుష్కలంగా వర్షాలు పడుతుండటంతో నీటి లభ్యత బాగా పెరిగింది. వరి నాట్లు జోరందుకోవడంతో రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో సీఎండీ స్థాయి నుండి కింది స్థాయి సిబ్బంది వరకు అప్రమత్తంగా వుంటూ ఎలాంటి అవాంతరాలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా ఈ వర్షాల సీజన్ లో అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా వుంటూ, వర్షాలు కురిసేటప్పుడు తప్పనిసరిగా తమ కార్యాలయాల్లో అందుబాటులో వుంటూ సరఫరా పర్యవేక్షించాలని నవీన్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డైరెక్టర్లు డా. నర్సింహులు, చక్రపాణి, కృష్ణా రెడ్డి, చీఫ్ ఇంజినీర్లు, సూపెరింటెండింగ్ ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

# ఆత్మహత్యకు పాల్పడబోయిన యువకుడు

(మొదటి పేజీ తరువాయి)

అంచున నిలబడి చెరువులోకి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించగా.. అక్కడే విధుల్లో ఉన్న డీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడింది. రామిరెడ్డిని మాటల్లోపెట్టి.., దృష్టి మరల్చి.. క్షణాల్లో కాపాడిన తిరుపతి యాదవ్‌ను కమిషనర్ అభినందించారు. అక్కడే విధుల్లో ఉండి.. యువకుడిని కాపాడేందుకు సహకరించిన సంతోష్ చారి, మహ్మద్ ఇమ్రాన్‌లను కూడా శాలువ కప్పి సన్మానించారు. దుర్గం చెరువు వంతెనపై వీరు నిలుచుండగా.. రంధ్రాలను శుభ్రం చేస్తున్నప్పుడు ఓ యువకుడు దూకేందుకు యత్నిస్తున్న దృశ్యాలను చూశామని.. ఒకవైపు అతిడిని దూకకుండా మాటల్లో పెట్టి... మరో వైపునుంచి వచ్చి కాపాడినట్టు- ఆ ముగ్గురు డీఆర్ ఎఫ్ ఉద్యోగులు కమిషనర్‌కు వివరించారు.

# జూరాల 12 గేట్లు ఎత్తివేత

**గద్వాల,జులై 28(పిసిడబ్ల్యు న్యూస్):** జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల జలాశయానికి ఇన్ ఎలో 1,00,257 వేల క్యూసెక్కులుండగా ఔట్ ఎలో 92,556 క్యూసెక్కులుగా ఉంది. జూరాల ప్రాజెక్టు 12 గేట్లు- ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318.816 మీటర్లు ఉండగా ప్రస్తుత నీటి నిల్వ 317.170 మీటర్లుగా ఉంది. జూరాల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 7.795 టిఎంసిలుండగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థం 9.657 టిఎంసిలుగా ఉంది. విద్యుత్ ఉత్పత్తి ఐదు కేంద్రాలలో కొనసాగుతోంది.

# పాత్రికేయులు విశ్వసనీయతతో కూడిన విశ్లేషణాత్మక వార్తలను రాయాలి







## జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి

**హన్మకొండ జులై 28(పిసిడబ్ల్యు న్యూస్):** పాత్రికేయులు విశ్వసనీయ తతో కూడిన విశ్లేషణాత్మక వార్తలను రాయాలని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వరంగల్ నగరం లోని కరీంబాద్ లో గల తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్లో వరంగల్ జిల్లా ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు రెండు రోజులపాటు నిర్వహించిన వృత్తి నైపుణ్యత శిక్షణ ముగింపు కార్యక్రమానికి అదనపు కలెక్టర్, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డిలు ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడు తూ నిజ నిర్ధారణ జర్నలిజంలో ఒక ముఖ్యమైన భాగమనీ, జర్నలిస్టులు కచ్చితంగా నిజాలను నిర్ధారించుకున్న తర్వాతే నిర్భయంగా వార్తలు రాయాలన్నారు. జర్నలిస్టులు వార్తల గురించి సమగ్ర పరిశోధన చేసి మూలాలను తనిఖీ చేసి, సమాచారం యొక్క ఖచ్చితత్వాన్ని నిర్ధారించి తదుపరి వార్తలు రాయాలన్నారు. జర్నలిస్టులు వృత్తి పరమైన నియమాలను పాటించాలన్నారు. ఖచ్చితమైన నమ్మదగిన సమాచారం అందించడం ద్వారా జర్నలిస్టు సమాజానికి సేవ చేసిన వారు అవుతారు అన్నారు. నైతిక విలువలు పారదర్శకత కలిగిన వార్తలు రాసినప్పుడే జర్నలిస్టులపై ప్రజలకు గౌరవం పెరుగుతుందన్నారు.ప్రస్తుతం డిజిటల్ మీడియా రంగంలో వార్తల సేకరణ సులభమవుతుందన్నారు. భవిష్యత్తులో పత్రికల నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రధాన పాత్ర పోషించనుందన్నారు.జెడ్పి సీఈఓ రామిరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు పక్షపాతం లేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తూ వార్తలు సేకరించాలన్నారు. జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానంగా ఉండాలని తెలిపారు. ప్రస్తుత సమాజంలో వార్త వైరల్ గా మారుతోందని, సామాజిక మాధ్యమాల్లో ఒకే అంశాన్ని పదే పదే ప్రచారం చేస్తూ అబద్దాన్ని నిజం చేసేందుకు పోటీ పడుతున్నారని, ఈ నేపథ్యంలో పాత్రికేయులు సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డేటా జర్నలిజం గురించి తెలుసుకోవాలన్నారు.రెండో రోజు జరిగిన శిక్షణ తరగతుల్లో 99 టీవీ స్టేట్ బ్యూరో తోట భావ నారాయణ గ్రామీణ వార్తలు, ఎలక్ట్రానిక్ మీడియాపై వివరించారు.పరిశోధనాత్మక కథనాల చీఫ్ ఎడిటర్ ఉడుముల సుధాకర్ రెడ్డి పరిశోదాత్మక కథనాలు, నేర వార్తలు, ఫేక్ న్యూస్, సైబర్ క్రైమ్ తదితర అంశాల గురించి కూలం కశంగా వివరి ంచగా, దిశ దినపత్రిక చీఫ్ ఎడిటర్ మార్కండేయ వార్త కథనాలు, ప్రత్యేక కథనాలను రాసే సమయంలో పరిగణలోకి తీసుకోవాల్సిన అంశాల గురించి వివరంగా తెలిపారు. అనంతరం శిక్షణ తరగతులకు హాజరైన పాత్రికేయులకు ముఖ్య అతిధులు ధ్రువ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, మేనేజర్ శైలేష్ రెడ్డి, డబ్ల్యు జే ఐ జే యు అధ్యక్షులు శ్రీరామ్ రామచందర్, ప్రధాన కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్, డి పి ఆర్ ఓ అయూబ్ అలీ, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్ డాక్టర్ వరుణ్, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టండి

- హాస్టల్స్‌ను కేటాయించిన ప్రతి అధికారి తప్పనిసరిగా పర్యవేక్షణ చేయాలి
- హాస్టల్స్‌లో ఆహారం, తాగునీరు, పరిశుభ్రతను పాటించేలా చర్యలు తీసుకోవాలి
- ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులు తహసీల్దార్లతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం





**హన్మకొండ, జులై 28(పిసిడబ్ల్యు న్యూస్):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను పెండింగ్ లో లేకుండా వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారుసోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులు, పలువురు తహసీల్దార్లతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు తమ అర్జీలను జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ప్రజలు అందజేసిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తూ ప్రజలు 283 వినతులను అందజేశారు.ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ ఆయా శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రజావాణి అర్జీల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, హాస్టల్స్ తనిఖీ, పర్యవేక్షణ, తీసుకోవాల్సిన చర్యల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు ఇటీవలి వరకూ హాస్టల్స్ తనిఖీ చేసినప్పుడు అక్కడ గుర్తించిన అంశాలు, సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన వినతులను సంబంధిత శాఖల అధికారులు పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా జిల్లా అధికారులు పర్యవేక్షణకు తమకు కేటాయించిన హాస్టల్స్ కు తనిఖీ కి వెళ్ళినప్పుడు బేసిక్ చెక్ లిస్టు ప్రకారం వసతులు ఉన్నాయా లేదా అనేది జిల్లా అధికారులు తనిఖీ చేయాలన్నారు. ఇప్పటి వరకూ తనిఖీ చేయగా ఆయా హాస్టల్స్ లో ఏయే అంశాలను, సమస్యలను గుర్తించారని వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలువురు తహసీల్దార్లతో కలెక్టర్ మాట్లాడారు. హాస్టల్స్ లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, తాజా కూరగాయలు వండే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి హాస్టల్ నుండి చెత్త తరలింపు జరగాలన్నారు. తప్పనిసరిగా డ్రై డే (శుక్రవారం) కార్యకలాపాలు అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వాటిని సరిచేయాలని అన్నారు. గతేడాది ఇబ్బందులు ఏర్పడిన ప్రాంతాలను సందర్శించాలని సూచించారు. హాస్టల్స్ లో ఫుడ్, వాటర్ సప్లై బాగుందా లేదా అనేది తప్పనిసరిగా అధికారులు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండలాల పరిధిలోని గ్రామాలలో వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి ని పరిశీలించి ఇండ్ల నిర్మాణాలు త్వరగా చేసేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వినతులను సమర్పించేందుకు ప్రజలు ఎక్కువ సంఖ్యలో వస్తుండడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అందుకు తగిన ఏర్పాట్లను చేశారు. ప్రజావాణి దరఖాస్తు సమర్పించిన వారికి రిసిప్ట్ ను ఆలస్యం లేకుండా అందించేందుకు అదనపు సిబ్బందిని నియమించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సాఫీగా వినతులను సమర్పించే విధంగా సిబ్బందిని కేటాయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, డిఆర్డిఓ మేన శ్రీను, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, జిల్లా అధికారులు, పలువురు తహసిల్దార్లు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం



**హన్మకొండ జులై 28(పిసిడబ్ల్యు న్యూస్):** పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కమ్యూనిటీ హాల్స్, గ్రామ పంచాయతీ భవనాలు, మహిళా కమ్యూనిటీ హాల్స్, అంగన్వాడి భవనాలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతి, నూతన పనులపై ఆ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లోని ఆయా మండలాల్లో కమ్యూనిటీ హాల్స్, గ్రామ పంచాయతీ భవనాలు, మహిళా కమ్యూనిటీ హాల్స్, అంగన్వాడి భవనాలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతి గురించి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఈఈ ఆత్మారాం, డీఈలు, ఏఈలు కలెక్టర్ కు వివరించారు. అభివృద్ధి పనుల స్థాయిలను, పనుల పర్యవేక్షణ, ఎప్పటి వరకు పూర్తి చేస్తారు, అభివృద్ధి పనుల విస్తీర్ణం, ఎంత శాతం పనులు పూర్తయ్యాయనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులలో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కొత్తగా చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో మిగిలిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి అన్నారు. ఈ సమావేశంలో డీఈలు శ్రీనివాసరావు, జయశంకర్, శిరీష, యుగంధర్, ఏఈలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల ముగ్గుల కార్యక్రమం

- పాల్గొన్న పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పోరండ్ల వేణు



**పరకాల, జులై 28 (పిసిడబ్ల్యు న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు పథకం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం సోమవారం పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 03వ వార్డులో అడ్డగట్ల కిరణ్ మై-దాస్ కు మంజూరైన ఇందిరమ్మ ఇల్లుకు ముగ్గు పోయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మూడో వార్డు వార్డ్ ఆఫీసర్ మాధవి తో పాటుగా,పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొరండ్ల వేణు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు పరకాల పట్టణ ఓబీసీ చైర్మన్ ఆలేటి రాజు,సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం శివకుమార్,రాజేందర్ లు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ చైర్మన్ కళ్యాణికి ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ సన్మానం



**ములుగు,జులై 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు మార్కెట్ కమిటీ కొత్త చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రేగ కళ్యాణి కి సోమవారం ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరఫున ఘన సన్మానం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో బృందంగా వెళ్లిన మిల్లర్లు ఆమెకు పుష్పగుచ్ఛం అందించడంతో పాటు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ మార్కెట్ కమిటీ అభివృద్ధి, మిల్లర్ల సమస్యలు, కొనుగోలు వ్యవస్థ వంటి అంశాలపై చైర్మన్ కళ్యాణితో చర్చించారు. అనంతరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పేద సారంగం మరియు మార్కెట్ సెక్రటరీ సోనియాలకూ శాలువాలతో సన్మానం చేశారు.కార్యక్రమంలో గోవిందరావుపేట పిఎసిఎస్ చైర్మన్ ఎల్లారెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి సహోదర రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్, ఉపాధ్యక్షులు సుదర్శన్ రెడ్డి సహా జిల్లాలోని పలువురు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# నూతన గృహప్రవేశానికి హాజరైన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్





**మహబూబాబాద్ జిల్లా జూలై 28(పి.సి.డబ్ల్యూ న్యూస్):** పట్టణంలోనీ కురవి రోడ్ లో జరిగిన దీరావత్ వీరన్న, లత నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి మాజీ మంత్రి, సత్యవతి రాథోడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వీరన్న దంపతులకు కుటుంబ సభ్యులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో డోర్నకల్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఐలి నరహరి గౌడ్,నెహ్రూ నాయక్,బొడ శ్రీను నాయక్,మన్యు ప్యాట్నీ,అల్లూరి కిషోర్ వర్మ,భద్రు,తదితరులు పాల్గొన్నారు.

# ములుగు పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్



**ములుగు, జిల్లా జూలై 28(పి.సి.డబ్ల్యూ న్యూస్):** ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీట్లు మరియు సస్పెక్ట్ షీట్లు కలిగిన వ్యక్తులను సోమవారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ములుగు సీఐ డి. సురేష్ ఎస్సై చి. వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో నిర్వహించారు.రౌడీ షీటర్లు భవిష్యత్తులో నేరాలు చేయకుండా సత్ప్రవర్తనతో ఉండాలని, సామాజికంగా మారాలని వారికి అధికారుల బృందం చక్కటి సూచనలు ఇచ్చింది. నేరపూరిత జీవితం వల్ల కలిగే నష్టాలు, ప్రజల నుంచి దూరం అవడం, కుటుంబ సభ్యులకు కలిగే ఇబ్బందుల గురించి వివరించారు.కౌన్సిలింగ్ అనంతరం హాజరైన వారు మంచి జీవన మార్గాన్ని ఎంచుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విధంగా కౌన్సిలింగ్ ద్వారా తిరుగుబాటు మార్గంలో ఉన్నవారిని మంచివారిగా మార్చడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని సీఐ డి. సురేష్ తెలిపారు.

# తెలంగాణ బీసీ ప్రజా సంఘం రామగుండం నియోజక వర్గ అధ్యక్షులుగా నరేష్



**హన్మకొండ జులై 28(పిసిడబ్ల్యు న్యూస్):** తెలంగాణ బీసీ ప్రజా సంఘం పెద్దపెల్లి జిల్లా రామగుండం నియోజక వర్గ అధ్యక్షులుగా గోదావరిఖని కి చెందిన పోలవేణి నరేష్ ని నియమించిన తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్. వరంగల్ లో జరిగిన బీసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నాయిని భరత్ నియామక పత్రం అందజే శారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలు బీసీల హక్కుల పోరాటాల కోసం నా వంతు కృషి చేస్తానని అన్నారు ఈ పదవి రావడానికి సహకరించిన బీసీ నాయకులు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రైవేట్ ఆసుపత్రులకు కొమ్ముకాస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ: పీడీఎస్‌యూ ధ్వజం



**హుజురాబాద్, జులై28 (పీసీడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్, జమ్మికుంట ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ ఆసుపత్రుల అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో పూర్తిగా విఫలమైన హుజురాబాద్ డిప్యూటీ డీఎంహెచ్ఓ చందు నాయక్‌ను తక్షణమే విధుల్లోంచి తొలగించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పీపుల్స్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ (పీడీఎస్‌యూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ నేతృత్వంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ మాట్లాడుతూ, ప్రైవేట్ ఆసు పత్రులు రోగుల నుంచి ఇష్టానుసారంగా డబ్బులు దండుకుంటున్నాయని, రకరకాల పరీక్షల పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమా డుతూ అందినకాడికి దోచుకుంటున్నాయని ఆరోపించారు. ఈ అక్రమాలను అరికట్టడంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ చందు నాయక్ పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారిపై ఎలాంటి పర్యవేక్షణ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చందు నాయక్ అవినీతి మత్తులో మునిగిపోయి, ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు కొమ్ముకాస్తున్నారని కుమార్ ధ్వజమెత్తారు. ప్రజల ఆరోగ్యం పట్ల బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న చందు నాయక్‌పై తక్షణమే విచారణ జరిపి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, అంతేకాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, పద్మ, శిరీష పాల్గొన్నారు.

## హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై సోషల్ మీడియాలో అసభ్య ప్రచారం: బీఆర్ఎస్ ఫిర్యాదు..






**హుజురాబాద్, జులై28 (పీసీడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, అసభ్యకర పోస్టులు పెడుతున్నారంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నాయకులు ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, కౌశిక్ రెడ్డి కుటుంబ సభ్యులను అప్రతిష్టపాలు చేయాలని కుట్ర పన్నుతున్నారని బీఆర్ఎస్ ఆరోపించింది. కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా ఎదురైన పరాజయాలను జీర్ణించుకోలేక ఇలాంటి నిరాధార ఆరోపణలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పాలనాపరమైన అంశాలపై ప్రశ్నిస్తున్న కౌశిక్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఆయనను బద్నాం చేయడమే కాంగ్రెస్ కుట్ర అని వారు స్పష్టం చేశారు. ఇకపై కుటుంబ సభ్యులపై ఇలాంటి పోస్టులు పెడితే చూస్తూ ఊరుకోబోమని బీఆర్ఎస్ నాయకులు హెచ్చ రించారు. ఈ ఫిర్యాదు సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు కీలక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఒకరి ఆత్మహత్య



**చిట్యాల, జులై 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండలం తిరుమలపురం గ్రామానికి చెందిన పెల్లి రవి కొమురయ్య 42 మున్నూరు కాపు తను అతడికి పెళ్లి అయి ఒక కొడుకు కూతురు సంతానం కలదు, 27/07/2025 రోజున రాత్రి ఎవరినో తిడుతూ ఉండగా తన భార్య అయిన కోమల గొడవ ఎందుకని చెప్పి ఇంట్లో పడుకోబెట్టి తన కూతురు కొడుకుతో సహా ఇంటి ముందున్న షెడ్డులో పడుకున్నారు రాత్రి 1:30 గంటలకి పెల్లి రవి కొడుకు అయినా విశ్వంత్ మూత్రం వస్తుందని చెప్పగా పెల్లి రవి భార్య కోమల ఇంట్లోకి మొబైల్ లైట్ కోసం వెళ్లి చూడగా పెల్లి రవి ఇంట్లో ఉన్న అడ్డువాసానికి తెలుపు రంగు చున్నితో ఉరేసుకొని ఉన్నాడని అది చూసి అరవగా ఇంటిపక్క వారైనా అనుముల రవి, కాలే రవి ,నీరటి రామచంద్రులు వచ్చి చూడగా పెల్లి రవి అప్పటికే చనిపోయి ఉన్నాడని పెల్లి కోమల తన అత్త అయిన పెల్లి లింగమ్మ లేట్ కొమురయ్య కి ఫోన్ చేసి తెలుపగా, లింగమ్మ తన కొడుకు మృతికి గల కారణాలు తెలుసుకొని తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్సై శ్రవణ్ కుమార్ తెలిపారు

# కరీంనగర్-జగిత్యాల విస్తరణ పనులను ప్రారంభించండి...

- తెలంగాణకు సీఆర్ఐఎఫ్ నిధులను మంజూరు చేయండి.
- కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన బండి సంజయ్.
- రూ.113 కోట్లతో సీఆర్ఐఎఫ్ ప్రతిపాదనలను అందజేసిన బండి సంజయ్.
- ప్రజల అభ్యంతరాలు, న్యాయపరమైన అడ్డంకులన్నీ అధిగమించామన్న గడ్కరీ.
- కమిటీ నివేదిక వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని హామీ.
- త్వరలోనే సీఆర్ఐఎఫ్ నిధుల విడుదలపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడి.





**న్యూఢిల్లీ,జులై28(పీసీడబ్ల్యూ న్యూస్):** దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న కరీంనగర్-జగిత్యాల విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజప్తి చేశారు. ఈరోజు న్యూఢిల్లీలో నితిన్ గడ్కరీని కలిసిన బండి సంజయ్ కుమార్ కరీంనగర్-జగిత్యాల విస్తరణ పనులతోపాటు సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్ (సీఆర్ఐఎఫ్) మంజూరు అంశాలపైనా చర్చించారు. కరీంనగర్ నుండి జగిత్యాల వరకు 4 లేన్ విస్తరణ కోసం గత ఎన్నికలకు ముందే కేంద్రం రూ.2151 కోట్ల 35 లక్షల నిధులతో ప్రతిపాదనలు రూపొందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయా ప్రతిపాదనలకు ఆమోదం పొందడంతోపాటు టెండర్ ప్రక్రియను కూడా ప్రారంభిస్తామని అధికారులు నేటికీ టెండర్ ప్రక్రియ ప్రారంభం కాని విషయాన్ని గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంబంధిత శాఖ ఉన్నతాధికారులను పిలిపించిన గడ్కరీ అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి వచ్చిన అభ్యంతరాలు, న్యాయపరమైన అడ్డంకుల నేపథ్యంలోనే కరీంనగర్- జగిత్యాల రోడ్డు విస్తరణ పనులకు ఆటంకం ఏర్పడిందని తెలిపారు. ప్రస్తుతం ఆయా అడ్డంకులన్నీ అధిగమించి నివేదికను కమిటీకి పంపించామని తెలిపారు. ఆ కమిటీ నివేదిక ఇచ్చిన వెంటనే రోడ్డు పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను పూర్తి చేసి అతి త్వరలోనే విస్తరణ పనులకు శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు. అనంతరం బండి సంజయ్ తెలంగాణలో పలు రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు పెండింగ్ లో ఉన్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) ను విడుదల చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీంతోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్ లో ఉన్న రోడ్ల ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి అందజేశారు. మొత్తం రూ. 113 కోట్లతో కూడిన సీఆర్ఐఎఫ్ ప్రతిపాదనలను గడ్కరీకి సమర్పించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని బావుపేట -ఖాజీపూర్ రోడ్డులో భాగంగా మానేరు నదిపై హై లెవల్ బ్రిడ్జ్ నిర్మాణంతోపాటు గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి-పోతూర్ రోడ్డు విస్తరణ పనులు వీటిలో ఉన్నాయి. దీంతోపాటు చందుర్తి నుండి మోత్కురావుపేట వరకు (కిమీ 5/0 నుండి 8/450 వరకు) వంతెనల నిర్మాణ పనుల ప్రతిపాదనలు ఉన్నాయి. అట్లాగే కిస్టంపల్లి వరకు రోడ్డుపై వంతెన నిర్మాణ పనులు, శంకరపట్నం మండలంలోని అర్కాండ్ల (గ్రామం) నుండి కన్నాపూర్ (గ్రామం) వరకు వరద కాలువపై హై లెవల్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రతిపాదనలు సైతం వీటిలో ఉన్నాయి. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ త్వరలోనే తెలంగాణకు సీఆర్ఐఎఫ్ నిధులు విడుదలపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# స్థానిక సంస్థల ఎన్నికల కోసం సిద్ధంగా ఉండండి...

- బిజెపి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయండి..
- బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి...



**కరీంనగర్ రూరల్, జూలై28 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, మండలంలోని నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా బిజెపి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రోజున కొత్తపల్లి రూరల్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ముఖ్య కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీ విజయం కొరకు నాయకులు, కార్యకర్తలు తగిన కార్యాచరణతో ముందుకు కొనసాగాలన్నారు. ఎన్నికల కోసం బూత్ కమిటీని సన్నద్ధం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, మోడీ ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం గంగా డి కృష్ణారెడ్డి ఈ సందర్భంగా పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కుంట తిరుపతి, శక్తి కేంద్ర ఇన్చార్జులు కడార్ల రతన్ కుమార్, వేముల అనిల్ కుమార్, కోమటిరెడ్డి అంజన్ కుమార్, సోమినేని కర్ణాకర్ ,గుడిసెల రంజిత్ కుమార్, పో ర్తి అనిల్ కుమార్, బోనాల నరేష్ ,కడారి శ్రీనివాస్ ,బోయిని మహేందర్, కట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 44వ డివిజన్లో పర్యటించిన ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి సర్ఫరాజ్ అహ్మద్...








**కరీంనగర్ టౌన్,జూలై28(పీసీడబ్ల్యూ న్యూస్):** సోమవారం రోజున ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి సర్ఫరాజ్ అహ్మద్ నగరంలోని పలు డివిన్లలో పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా 44వ డివిజన్ సివిల్ హాస్పిటల్ చౌరస్తాలో డ్రైనేజీ సిస్టం చెడిపోవడం మరియు డివిజన్లోని సాహేత్ నగర్, శర్మనగర్, సాయినగర్, ఇండ్లలోకి మురికి నీళ్లు చేరడంతో డివిజన్ వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సందర్భంగా డివిజన్ మాజీ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్ (మార్షల్) మురికి నీరు ఆగిన ప్రాంతాలలో మున్సిపల్ సిబ్బంది సహకారంతో బ్లీచింగ్ పౌడర్ మరియు క్లీనింగ్ కార్యక్రమం చేపట్టారు. మెండి చంద్రశేఖర్ పిలుపుమేరకు కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి సర్ఫరాజ్ అహ్మద్, డివిజన్లో పర్యటించి పరిస్థితులను చూసి వారు మున్సిపల్ అధికారులతో డివిజన్ ప్రజల సమస్యలను త్వరగా పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు, మరియు రోడ్ల పైన ఎక్కడైతే నీరు ఆగుతున్నాయో కల్వర్టులు, డ్రైనేజ్ లీకేజీలు, వెంటనే క్లియర్ చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్, అడిషనల్ కలెక్టర్, ఆర్డీయో మరియు మున్సిపల్ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బిజెపి నేతలు పేదల కోసం సొంత డబ్బులతో ఒక్క స్కూల్ నిర్మించారా..?

- ఎంఐఎం నాయకులు చేసిన సైకిళ్ల పంపిణీ చూసి బండి సంజయ్ కాపీ కొట్టారు
- ఎంఐఎం పార్టీ చొరవతో ముస్లిం డివిజన్లలో వందల కోట్ల అభివృద్ధి జరిగింది
- ఎంఐఎం పార్టీ విధి విధానాలకు ఆకర్షితులై యువకులు, పెద్దలు చేరుతున్నారు
- ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్.

**కరీంనగర్,జూలై28(పీసీడబ్ల్యూ న్యూస్):** సెక్యులర్ వాదుల దేశభక్తిని నిత్యం శంకించే బిజెపి, ఆర్ఎస్ఎస్, సంఘపరివార్ నాయకులు, ముస్లింలను బూచిగా చూపిస్తూ, హిందువులను ఓటు బ్యాంకుగా మాత్రమే మార్చుకొని రాజకీయ లబ్ధి పొందుతున్నారని, స్వాతంత్రం వచ్చిన నాటి నుండి, నేటి వరకు పేదల కోసం తమ సొంత డబ్బులతో ఒక్క స్కూల్ కట్టించి, నిరుపేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన దాఖలాలు కనిపించవని, ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ విమర్శించారు. ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు, ఆదివారం రాత్రి నగరంలోని కశ్మీర్ గడ్డలోని ఓఫంక్షన్ హాల్లో 43, 61వ డివిజన్ల బాధ్యులు బర్కత్ అలీ, ఆతిన ఆధ్వర్యంలో 200మంది యువకులు, పెద్దలు ఎంఐఎంలో చేరారు.




పార్టీలో చేరిన యువకులకు కండువాలు కప్పి గులాం అహ్మద్ ఎంఐఎంలోకి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన రెండు డివిజన్ల స్థాయి సదస్సులో గులాం అహ్మద్ మాట్లాడుతూ.. ఎంఐఎం పార్టీ శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ నిరుపేదల కోసం విద్యాసంస్థలను స్థాపించి, ఉచితంగా ప్రతి ఏడాదికి 22000 మంది విద్యార్థులను చదివిస్తున్నారని చెప్పారు. ఇలాంటి మంచి పనులను నాటి జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మొదలుకొని, నేటి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమిత్ షా, బండి సంజయ్ వరకు పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు, తమ సొంత డబ్బులతో ఒక్క స్కూల్ ను నిర్మించారా అని ప్రశ్నించారు. గోదాం గడ్డలో గత రెండేళ్ల క్రితం ఎంఐఎం పార్టీ కార్పొరేటర్ కుటుంబ సభ్యులు విద్యార్థుల కోసం ఉచితంగా సైకిళ్లను తమ సొంత డబ్బులతో పంపిణీ చేస్తే, అట్టి కార్యక్రమాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ కాపీ కొట్టారన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల నుండి వచ్చే సీఎస్సార్ నిధుల (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ద్వారా మాత్రమే బండి సంజయ్ సైకిళ్లను పంపిణీ చేశారన్నారు. ఈసైకిళ్లు మోడీ గిఫ్ట్ అని చెప్పడం, వాళ్లు పంపిణీ చేసే సైకిళ్లకు కాషాయపురంగు పులమడం ఎంతవరకు సమంజసమో సభ్య సమాజం ఆలోచించాలన్నారు. ఎంఐఎం పార్టీ చొరవతో నగరంలోని దళిత, ముస్లిం డివిజన్లలో స్మార్ట్ సిటీ ద్వారా వందల కోట్ల అభివృద్ధి పనులు జరగాయని పేర్కొన్నారు. కాశ్మీర్ గడ్డలో మోడల్ రైతు బజార్ నిర్మాణంతో పాటు గోదాం గడ్డలో మోడల్ దోబీ ఘాట్ నిర్మాణం ఎంఐఎం కృషి వల్లనే జరుగుతుందన్నారు. 2005-2006లో కాలంలో శాసహబ్ మొహల్ల నుంచి నగరంలోనే అత్యధికంగా 1280పైచిలుకు ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పట్టాలు ఇప్పించిన ఘనత ఎంఐఎం కార్పొరేటర్ రాఫియాసుల్తానా కే దక్కిందన్నారు. జగిత్యాలలో ఎంఐఎం కౌన్సిలర్ రజియుద్దీన్ కృషి ఫలితంగా 900డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ముస్లింలకు మంజూరయ్యాయని గుర్తు చేశారు. ఎంఐఎం పార్టీ విధి విధానాలకు ఆకర్షితులై యువకులు, సీనియర్ సిటిజన్స్ పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతం, విస్తరణ కోసం బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు చేరికలు కొనసాగుతాయన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, నాయకులు బర్కత్ అలీ, ఆతిన, ఖమరొద్దీన్, ఇబ్రహీం, అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, అలిబాబా, అజర్ దబీర్, అన్నేమల్ల సురేశ్, మొహసీన్, సాజిద్, అన్వర్ ఖాన్, ఖాజా మజహరోద్దీన్, అజ్మత్ అలీ, ఖాలీద్, నసీం ఖాన్, అశు, అబిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



# సిగాచి కంపెనీ ప్రమాద బాధితుల పక్షాన సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన బిఆర్ఎస్ నాయకులు

- డెడ్ బాడీలు అప్పగించడంలో, పరిహారం అందించడంలో వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీశారు
- అంతకుముందు బాధిత కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ.





**పటాన్ చెరువు ప్రతినిధి జూలై 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.సిగాచి ఘటన జరిగి నెల రోజులు కావొస్తున్నది.బాధిత కుటుంబాలు కన్నీళ్ల మధ్య నెల మాసికం చేసుకుంటున్నారు.సీఎం వచ్చి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. నెల రోజులు అయ్యింది. ఒక్కరికి అందలేదు.అంతిమ కార్యక్రమాలు జరిపేందుకు శవాలు కూడా ఇవ్వని దుస్థితి. బూడిదను తీసుకువెళ్లి గోదావరిలో కలుపుకున్నమని కన్నీరు పెట్టుకుంటున్నారు.ఉమ్మడి ఏపీలో, మన రాష్ట్రంలో ఇంత దారుణమైన ప్రమాద ఘటన జరగలేదు. 54 మంది చనిపోతే ప్రభుత్వ స్పందన అత్యంత దయనీయం. బాధ్యతారాహిత్యం.ఎక్స్ గ్రేషియా, డెత్ సర్టిఫికేట్ ఎప్పుడు ఇస్తారు అని బాధితులు అడిగితే, ఎస్ ఎల్ బీ సీ ఘటనలో శవాలు కూడా రాలేదు, మీకు బూడిదైనా దొరికింది అని అత్యంత అమానవీయంగా మాట్లాడుతున్నారని చెబుతున్నారు.ఏపీ, బిహార్, జార?ండ్, యూపీ నుంచి రావాలంటే, ఉండాలంటే 20, 30 వేలు ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులు బాధపడుతున్నారు.సీఎం కోటి ఇస్తామన్నరు, ఎప్పుడు ఇస్తారు, ఎవరు ఇస్తారు అని అడిగితే ఎవరూ చెప్పడం లేదని అంటున్నారు. వెంటనే ఇచ్చిన మాట ప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.చాలా మంది ఆసుపత్రుల్లో వైద్యం పొందుతున్నారు. తీవ్రంగా గాయపడ్డవారికి సీఎం పది లక్షలు ఇస్తామని చెబితే, 50వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు.తీవ్రంగా గాయపడిన వారికి 50లక్షలు ఇచ్చి, నెల నెలా వేతనం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.చివరకు హైకోర్టులో సైంటిస్ట్ ఫర్ పీపుల్ స్వచ్ఛంద సంస్థ బాధితులకు పరిహారం ఇవ్వాలని రిట్ పిటిషన్ వేసింది. నెల గడిచినా ఎంత మంది చనిపోయారు, ఎంత మంది క్షతగాత్రులు అధికారికంగా వెల్లడించలేదు.చనిపోయిన వారి పేర్లు, ఎవరెవరికి ఎంత ఇచ్చారు, క్షతగాత్రులకు ఎంత ఇచ్చారు అనేది ఈ ప్రభుత్వం ఎందుకు దాచి పెడుతున్నది.ఇప్పటి వరకు నష్టపరిహారం వివరాలు వెల్లడించకుండా ఎందుకు గోప్యంగా ఉంచారు సమాధానం చెప్పాలి.చనిపోయిన జగన్మోహన్ కొడుకు యశ్వంత్ ఇచ్చిన ఫిర్యాదులో.. సిగాచి కంపెనీలో పాత మిషన్ వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని అనేక సార్లు కార్మికులు చెప్పినా, కంపెనీ పట్టించుకోలేదని పేర్కొన్నారు.అంటే యాజమాన్యం పూర్తి నిర్లక్ష్యం ఉంది.ఎందుకు యాజమాన్యం మీద కేసు పెట్టలేదు ఫిర్యాదులో స్పష్టంగా ఉంది, ఎఫ్ ఐ ఆర్ కూడా అయ్యి ంది. ఎందుకు యాజమాన్యం కాపాడుతున్నవు రేవంత్ రెడ్డి ఎందుకు యాజమాన్యంతో కుమ్మక్కు అయ్యావు, కంపెనీతో ఉన్న లాలూచి ఏమిటి? బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నాం.శవాలు ఇవ్వకుండా 8 మంది మిస్సింగ్ అంటూ ఎందుకు వేధిస్తున్నారు. వెంటనే డెత్ సర్టిఫికేట్ ఇచ్చి, ఆ కుటుంబాలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి అని హెచ్చరించారు.

## పటాన్‌చెరులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆద్విక్ హైపర్ మార్ట్‌ను ప్రారంభోత్సవం

- ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన మాదిరి దేవేందర్ రాజు







**పటాన్ చెరువు ప్రతినిధి జూలై 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** పటాన్‌చెరు జిహెచ్ఎంసి డివిజన్ పరిధిలోని ప్రణీత్ ప్రణవ్ నైట్‌వుడ్స్‌లో ఏర్పాటు చేసిన హైపర్‌మార్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై, ప్రారంభించిన ఎమ్ డి ఆర్ ఫౌండేషన్ ఫౌండర్,పటాన్‌చెరు మాజీ సర్పంచ్ మాదిరి దేవేందర్ రాజు.ఈ సందర్భంగా దేవేందర్ రాజు మాట్లాడుతూ షాపింగ్‌కి అన్ని విభాగాల్లో నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉంచిన ఈ హైపర్‌మార్ట్ ద్వారా ఏర్పాటు చేయబడిన ఒక మంచి వాణిజ్య వేదిక. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే దీని లక్ష్యం" అని తెలిపారు. ఆద్విక్ హైపర్ మార్ట్ యాజమాన్యానికి ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## మహంకాళి, బీరప్ప స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం

- పాల్గొన్న కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్.





**పటాన్ చెరువు ప్రతినిధి జూలై 27 (పిసిడబ్ల్యూ న్యూస్):**పటాన్ చెరువు నియోజకవర్గ పరిధిలోని ఇస్నాపూర్ గ్రామంలో కురుమ సంఘం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మహంకాళి,బీరప్ప స్వామి వార్ల విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పటాన్చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ అమ్మవారిని,స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం శంకర్పల్లి లోని కేసియం గార్డెన్ నందు జరిగిన నీరుడి జయమ్మ,లక్ష్మణ్ ల కుమారుడి వివాహమహోత్సవానికి కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు

# కాంగ్రెస్, టీఆర్ఎస్‌లకు ఓట్లడిగే హక్కులేదు

## ప్రజలు బీజేపీ వైపే ఉన్నారు: బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి





**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, 28 జులై (పీసీడబ్ల్యూ న్యూస్):** తిమ్మాపూర్ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీ లకు ఓట్లడిగే హక్కులేదని బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మండలం లోని ముఖ్యనాయకులతో మహాత్మానగర్ లో మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ రెండు పర్యాయాలుగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తిమ్మాపూర్ మండలం నుండి అత్యధిక ఓట్లతో ప్రజలు బండి సంజయ్ కు భారీ మెజారిటీ అందించారని గుర్తుచేశారు. కేంద్రం నుండి వస్తున్న నిధులతో మండలం లోని ప్రతీ గ్రామం లో సిసి రోడ్లు, హైమాస్ట్ లైట్లు, బోర్లు మంజూరు చేశారని తెలిపారు.గతం లో టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ ద్వారా గెలిచిన జడ్పిటీసి,ఎంపీటీసి, సర్పంచ్ లు పరిపాలన పరంగా ప్రజలకు తీవ్ర, కష్ట, నష్టాలను కలిగించిందని ఆరోపించారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు.ఏళ్లతరబడి పెన్షన్ ల కోసం లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.అమలుగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్ పరిపాలన వైఫల్యాలను, మోసాలను గడప గడప కు ప్రచారం చేయాలని అన్నారు.పార్టీ సర్వే ప్రకారం అభ్యర్థులకు టికెట్ లు కేటాయించబడతాయని పేర్కొన్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలని తెలిపారు. ప్రతీ గ్రామం లో బూత్ కమిటీ ని పటిష్టం చేయాలని కోరారు.జడ్పిటీసి తో పాటుగా ఎంపిపి ని గెలిచే విదంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని సూచించారు.ఎన్నికలెప్పుడొచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రజలు బీజేపీ వైపే చూస్తున్నారని అన్నారు. మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, మండల ఇంచార్జి నరహరి లక్ష్మారెడ్డి,మాజీ జడ్పటీసి ఎడ్ల జోగిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్, చింతం శ్రీనివాస్,మండల ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులు రాజు యాదవ్,కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల రవీందర్ యాదవ్,బిజెవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్,బండి సాగర్,ఓబీసే మోర్చా అధ్యక్షులు దుర్సెట్టి రమేష్, జిల్లా ఈసీ మెంబర్ కొయ్యడ శ్రీనివాస్ గౌడ్,పడాల శ్రీనివాస్, బుర్ర శ్రీనివాస్,కానుగంటి మధుకర్ రెడ్డి,వేల్పుల ఓదయ్య, కామెర వెంకటేష్, గొల్ల గణేష్,ఎడ్ల భూంరెడ్డిలు పాల్గొన్నారు.

## వివిధ రకాల కార్యక్రమాలకు నీలం మధుకు ఆహ్వానం





**పటాన్ చెరువు ప్రతినిధి జూలై 27 (పిసిడబ్ల్యూ న్యూస్):**సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు నియోజకవర్గం చిట్కుల్ క్యాంప్ కార్యాలయంలో తనని కలిసిన వారిలో పటాన్ చెరువు నియోజకవర్గం పటాన్చెరు పట్టణంలో తేది 03/08/2025 నాడు శ్రావణమాసం పురస్కరించుకొని వీరశైవ లింగాయత్ మహాపాదయాత్ర కమిటి (అశోక్, రాజు తదితరుల) ఆధ్వర్యంలో నిర్వహించ నున్న 18వ మహా పాదయాత్ర కార్యక్రమానికి ఆహ్వానించిన కమిటీ సభ్యులు.వనపర్తి జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మండలం కలిమెట్ట గ్రామంలో త్వరలో ఆవిష్కరించనున్న పండగ సాయన్న విగ్రహానికి సంబంధించిన విషయంపై నాతో చర్చించిన నిర్వాహకులు వైస్ ఎంపీపీ బాలరాజ్, సర్పంచ్ పరమేష్, శ్రీనివాస్,యాదగిరి,గ్రామస్తులు.తేదీ 01/08/2025 నాడు సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్ లో నిర్వహించనున్న నవ తెలంగాణ దినపత్రిక 10వ వార్షికోత్సవ సభ కు ఆహ్వానించిన నవ తెలంగాణ మీడియా మిత్రులు.పటాన్చెరు నియోజకవర్గ రామచంద్రపురం పట్టణం SN కాలనీలో తేది 03/08/2025 నాడు తలపెట్టిన శ్రీ నల్ల పోచమ్మ తల్లి తొట్టెల కార్యక్రమానికి ఆహ్వానించిన నిర్వాహకులు. ఇందుకు సానుకూలంగా స్పందించిన నీలం మధు ముదిరాజ్.



## 13వ వార్డు,అంబేద్కర్ యూత్ అసోసియేషన్ నూతన కమిటీకి ఘన సన్మానం





**హుజురాబాద్,జూలై 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ మున్సిపాలిటీ, 13వ వార్డు, ఇందిరానగర్ కాలనీలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్ నూతన కమిటీకి స్థానిక నాయకులు, గ్రామ పెద్దల సమక్షంలో ఘనంగా సన్మానం జరిగింది.తాజాగా జరిగిన నియామకాలలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా మోరె ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా కుక్కమూడి తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారి నియామకాన్ని పురస్కరించుకొని ఇందిరానగర్ కాలనీలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సన్మాన కార్యక్రమానికి హుజురాబాద్ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు యేముల పుష్పలత ముఖ్య అతిథిగా హాజరై, నూతన అధ్యక్ష, కార్యదర్శులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువత సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహంకాళి కొమురయ్య, కొంద్ర మల్లయ్య, కొలుగూరి బిక్షపతి, మోర్ మహేష్, కొలుగూరి సమ్మయ్య, కొలుగూరి శ్రీను, మరియు వెలిశాల నారాయణతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన మోరె ఉపేందర్, కుక్కమూడి తిరుపతిలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, వారి కార్యకలాపాలకు అన్ని విధాలా సహకరిస్తామని వారు హామీ ఇచ్చారు.అలాగే, యూత్ సభ్యులైన అరవింద్, నాగరాజు, సాగర్, గరిగె శివ, మోర్ కృష్ణ, హీరా సింగ్, బచన్ సింగ్, జీత్ సింగ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని, నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందిరానగర్ కాలనీ అభివృద్ధికి, యువత సంక్షేమానికి నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. .

## వెంకట్ రెడ్డి నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా దారం వెంకటేష్ గుప్తా ఎన్నిక



**ఉప్పల్,జులై 28(పిసిడబ్ల్యు న్యూస్):**హబ్సిగూడ డివిజన్ వెంకట్ రెడ్డి నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా దారం వెంకటేష్ గుప్తా ను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా దారం వెంకట్ గుప్తా మాట్లాడుతూ అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు సంఘం ప్రతినిధులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారం అందిస్తానని తెలిపారు. బొనగిరి శ్రీనివాస్ గుప్త, సంభు పాండయ్య గుప్తా,జైని నాగయ్య గుప్తా ,జిల్లా రవీందర్ గుప్తా, పల్లేర్ల బిక్షపతి గుప్తా, కొత్తపల్లి రమేష్ గుప్తా, ప్రకాష్ గుప్తా, కోర్తి వాడ రామచంద్ర ము గుప్తా కోర్తివాడ శ్రీనివాసులు గుప్తా, జిల్లా హరిబాబు గుప్తా,బోనగిరి శ్రవణ్, గుప్తా, రాచూరి జంగయ్య గుప్తా, మరియు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన డాక్టర్ బొరగాల రాజమోహన్‌కు సన్మానం



హుజూరాబాద్, జూలై 28(పిసిడబ్ల్యూ న్యూస్): హుజురాబాద్ గాంధీనగర్ కు చెందిన ప్రముఖ న్యూరో స్పెషలిస్ట్ పేదల పక్షపాతి డాక్టర్ బొరగాల రాజమోహన్ ప్రభుత్వ వైద్య కళాశాల మహబూబాబాద్ లో న్యూరో సర్జన్ విభాగ అధిపతి గా పదోన్నతి పొందిన సందర్భంగా సోమవారం ఎమ్మార్పీఎస్, మాదిగ ఉద్యోగుల సమాఖ్య మరియు వివిధ సంఘాల నాయకులు రాజమోహన్ గారిని ఇంటి వద్ద గౌరవపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భవిష్యత్తులో వైద్య రంగంలో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని పేద వర్గాలకు ఆరోగ్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ జాతీయ నాయకులు రుద్రారపు రామచంద్రం, మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా కార్యదర్శి డాక్టర్ తడికమళ్ళ శేఖర్, బిజెపి ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు బొరగాల సారయ్య , కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎర్ర రవీందర్, బిఆర్ఎస్ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎర్ర రాజ్ కుమార్, యంఈఫ్ నాయకులు పుట్టపోగుల ప్రసాద్, ఎర్ర మొగిలి, యూత్ నాయకులు ఎర్ర శ్రీధర్, మాజీ సర్పంచ్ ఎల్కపల్లి బాబు, 30 వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్ర కుమార్, మాదిగ కుల సంఘ నాయకులు ముక్క రామస్వామి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మొలుగు శ్రీనివాస్ పాల్గొన్నారు

## శీనన్న వసుళ్ల దందాపై ప్రజావాణిలో ఫిర్యాదు

- జూబ్లీహిల్స్ సర్కిల్ -18 టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఇంజ శ్రీనివాస్ అక్రమ నిర్మాణాల మాటున అక్రమ వసూళ్ల దందా పైన సోమవారం నాడు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం (టి జె ఎస్ ఎస్)





హైదరాబాద్,జులై 28(పిసిడబ్ల్యు న్యూస్): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జూబ్లీహిల్స్ సర్కిల్ -18 లో అక్రమ నిర్మాణాల మాటున జరుగుతున్న అక్రమ వసూళ్ల దందా పైన ఇప్పటికే అన్ని ఆధారాలతో సహా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యాంటీ కరప్షన్ బ్యూరో డైరెక్టర్ జనరల్ విజయ్ కుమార్, స్టేట్ విజిలెన్స్ డైరెక్టర్, ఎమ్. ఏ. యు. డి ప్రభుత్వ కార్యదర్శి ఇల్లంబర్తి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్. వి.కర్ణన్, జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, అడిషనల్ సి సి పి వెంకన్న, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఖైరతాబాద్ జోనల్ సిటీ ప్లానర్ సాంబయ్య, ఖైరతాబాద్ జూబ్లీహిల్స్ ఉప కమిషనర్ సమ్మయ్య జిహెచ్ఎంసి లోని ఉన్నత అధికారులకి టీ జే ఎస్ ఎస్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడమే కాకుండా అవినీతి అక్రమాలకు పాల్పడుతూ అక్రమ నిర్మాణాల దారుల రక్తాన్ని జలగలగా పిలుస్తూ అక్రమ వసూళ్ల దందాకు పాల్పడుతూ జూబ్లీహిల్స్ సర్కిల్ -18ని అక్రమ నిర్మాణాలను పుట్టగొడుగుల్లాగా పెంచి పోషిస్తూ జిహెచ్ఎంసి నిబంధనలు తుంగలో తొక్కుతూ అక్రమ నిర్మాణదారులకు ప్రధాన సలహాదారుడుగా మారిన అవినీతి అధికారి జూబ్లీహిల్స్ సర్కిల్ -18 అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసిపి) ఇంజ శ్రీనివాస్ పైన జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ప్రజావాణి లో సోమవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగింది. అవినీతి అధికారుల పై యుద్ధం అంటున్న తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం మొదటగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇలాకాలో అక్రమ నిర్మాణాలు ఏంటి, అని ఫిర్యాదుల వెల్లువ వెదజల్లుతూ టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఇంజ శ్రీనివాస్ చేస్తున్న అన్ని అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారులు త్వరితగతిన స్పందించి విజిలెన్స్ ఎంక్వయిరీ జరిపించి స్పెషల్ ఎంక్వైరీ ఆఫీసర్ ని నియమించి జూబ్లీహిల్స్ సర్కిల్ -18 లో జరుగుతున్న అన్ని అవినీతి అక్రమాలను బట్ట బయలు చేయవల సిందిగా మరోసారి విజ్ఞప్తి చేసు కుంటూ ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగింది. జూబ్లీహిల్స్ లోనే ఇలా ఉంటే నగరంలో 30 సర్కిలలో పరిస్థితి ఇంకా ఎంత ఘోరంగా ఉంటుందో ఆలోచించాలి. ఇప్పటికైనా జిహెచ్ఎంసి కమిషనర్ చొరవ చూపించి ఈ అవినీతి అధికారిపై విజిలెన్స్ ఎంక్వైరీ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, టౌన్ ప్లానింగ్ చీఫ్ సిటీ ప్లానర్ కె శ్రీనివాస్ స్పెషల్ ఎంక్వయిరీ ఆఫీసర్ ని నియమించి జూబ్లీహిల్స్ సర్కిల్ లో జరుగుతున్న అన్ని అవినీతి అక్రమాలపై నిజా నిజాలను వెలికి తీసే విధంగా ఓ నిజాయితీగల ఆఫీసు ని ఆఫీసర్‌ని నియమించాలని స్థానిక ప్రజాప్రతి నిధులు, ప్రజలు, విలేఖరులు కోరుకుంటున్నారు.

## వర్షాకాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టండి**

**వరద ముంపు, కట్టలు తెగే అవకాశం ఉన్న ప్రాంతాలలో ముందస్తు చర్యలు తీసుకోవాలి**

**ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేకాధికారి, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్ కె. శశాంక**

**హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో భారీ వర్షాలు, వరదల సంసిద్ధతపై హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్షా**



హన్మకొండ, జులై 28, (పిసిడబ్ల్యు న్యూస్): వర్షాకాలం నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేకాధికారి, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్ కె. శశాంక ఆదేశించారు. సోమవారం సాయంత్రం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో వర్షాకాలం నేపథ్యంలో హనుమకొండ, వరంగల్ జిల్లాలకు సంబంధించి భారీ వర్షాలు, వరదల సంసిద్ధత పై హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి లతో కలిసి సాగునీటి పారుదల, రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్, విద్యుత్, ఇతర శాఖల అధికారులతో భారీ వర్షాలు, వరదలు, కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలు, సంసిద్ధతపై సమీక్షించారు. భారీ వర్షాల వల్ల ఎక్కడ కూడా ప్రాణనష్టం సంభవించకుండా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ప్రత్యేక అధికారి శశాంక సూచించారు. ముఖ్యంగా జిల్లాలో బ్యాక్ వాటర్ ఏరియాలలో ప్రమాదాలు జరిగేందుకు ఎక్కువ ఆస్కారం ఉన్నందున, ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీ కరించాలని అన్నారు. ఎస్సారెస్పీ పరీవాహక ప్రాంతంతో పాటు కాలువలు, చెరువులు, ఇతర జలాశయాలలో చేపలు పట్టడానికి ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తక్షణమే స్పందించేలా ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహా, ఆయా శాఖలు సన్నద్ధమై ఉండాలని, క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. వరద జలాలు ప్రవహించే ప్రాంతాల మీదుగా ప్రజలు రాకపోకలు సాగించకుండా నిషేధం విధించాలన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, పరిస్థితిని ఎప్పటి కప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. ఇదివరకు జిల్లాలో, పలు ప్రాంతాల్లో కొందరు జల దిగ్బంధంలో చిక్కుకున్న సంఘటనలు నెలకొన్నాయని గుర్తు చేస్తూ, అలాంటి ప్రదేశాలకు ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరూ వెళ్లకుండా కట్టడి చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే, అవసరమైన పక్షంలో రాష్ట్రం నుండి సహాయక బృందాలు పంపించేలా చూస్తామని, స్థానిక పరిస్థితుల గురించి జిల్లా యంత్రాంగం ద్వారా ఎప్పటి కప్పుడు తెలియజేయాలని అధికారులకు సూచించారు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ, భారీ వర్షాల వల్ల వరద పరిస్థితి నెలకొంటే సమర్ధవంతంగా ఎదుర్కోవాలని హితవు పలికారు. లోతట్టు ప్రాంతాలు, కల్వర్టులు, చెరువుల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. పురాతన, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచే ప్రాంతాల పరిస్థితిని నిశితంగా పర్య వేక్షించాలని అన్నారు. ఎక్కడ కూడా చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా పరిస్థితులను పర్యవేక్షించాలని అన్నారు. కాగా, ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు గానే కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఔషధ నిల్వలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఎక్కడ కూడా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు, అతిసారం వంటివి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. వానాకాలం సీజన్ పంటల సాగుకు అవసరమైన ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని, అన్ని ప్రాంతాల రైతులకు ఎరువులు సరఫరా అయ్యేలా ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో 929 చెరువులు, కుంటలు ఉన్నాయని, ఇందులో యాభై శాతం నిండి ఉన్నాయన్నారు. వర్షాకాలం నేపథ్యంలో అగ్నిమాపక, డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. ఆపదమిత్ర వాలంటీర్లు కూడా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జిల్లాలో లోలైన్ కాజ్ వే లు లేవన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దోమలు పెరగకుండా యాంటీ లార్వా యాక్టివిటీస్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు డెంగ్యూ, ఇతర వ్యాధుల భారీన పడకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లా ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ, భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్ తో పాటు అగ్నిమాపక శాఖ, పోలీస్, మున్సిపల్ తదితర కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో వర్షాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే ప్రజలు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్: 9154252936, 1800 425 3424 కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని సూచించారు. భారీ వర్షాల పరిస్థితి గురించి వాతావరణ శాఖ అందిస్తున్న సూచనలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ అప్రమత్తం చేస్తున్నామని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితి ఏర్పడితే స్థానికులను తరలించేలా పునరావాస కేంద్రాలను కూడా గుర్తించి తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్ లు, చెరువులలో వచ్చి చేరుతున్న వరద జలాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేస్తున్నామని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేలా ప్రత్యేక బృందాలను నియమించామని తెలిపారు. జిల్లాలో పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గతంలో జరిగినవి పునరావృతం కాకుండా ప్రణాళిక బద్ధంగా గ్రేటర్ వరంగల్ నగరంలో అప్రమత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సత్వర సహాయం కొరకు కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ ఫోన్ నెంబర్: 1800 425 1980 కు ఫోన్ చేసి సమాచారం అందించ వచ్చని సూచించారు నగరంలోని ప్రధాన నాలాలు, కల్వర్టుల వద్ద చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. డిఆర్ ఎఫ్ , క్విక్ రెస్పాన్స్ టీమ్ లను నియమించి వరద వల్ల ఎలాంటి నష్టం కలుగకుండా సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. అంతకుముందు కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కు సమీపం నుండి వరద నీరు వెళ్లటకు నది నాలపై నిర్మించనున్న ప్రాంతాన్ని జిల్లా ప్రత్యేక అధికారి శశాంక సందర్శించి ఇంజనీరింగ్ అధికారుల నుండి వివరాలు తెలుసుకొని సమర్ధవంతంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిసిపి షేక్ సలిమా, రెవెన్యూ, మునిసిపల్, పోలీస్, విద్యుత్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల కోరిక మేరకు బోరబండ బస్సును పున:ప్రారంభించిన డిఎం

- బస్సును ప్రారంభించినందుకు డియంకు కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రయాణికులు
- బస్సు 60 రోజులు నడిస్తేనే ప్రయాణికుల సంఖ్య పెరుగుతుందంటున్న పరిశీలకులు



తొర్రూరు ప్రతినిధి,జులై 28(పిసిడబ్ల్యూ న్యూస్): ఉమ్మడి వరంగల్ జిల్లా తొర్రూరు టీజీఎస్ ఆర్టీసీ బస్సు డిపోలో బోరబండ బస్సు ఒకనాడు ఎంతో ఆదరణ పొందింది. హైదరాబాదు సికింద్రాబాద్ వెళ్లాలంటే ఆ రోజుల్లో బోరబండ బస్సు ఒక్కటే నడుస్తూ ఉండేది. ప్రయాణికుల మనసుల్లో బోరబండ బస్సు ఎంతో ఆదరణ పొందిన బస్సు. ఈ బస్సు కొరకు బోరబండ నుండి తొర్రూరు వచ్చేందుకు ప్రయాణికులు తెల్లవారుజాము నుండి బస్సు కొరకు ఎదురు చూస్తూ ఉండేవారు. కాలక్రమేన హైదరాబాద్ కు వెళ్తున్న బస్సుల సంఖ్య పెరిగిపోయి బోరబండ బస్సును కనుమరుగు చేశారు తొర్రూరు డిపోలోని ఆర్టీసీ అధికారులు. ఈ బస్సు ఈ కొరకు గత మూడు నెలల నుండి ప్రయాణికులు బస్సు వేయాలని తొర్రూర్ డిపో మేనేజర్ పద్మావతిని వేడుకుంటున్నారు. బోరబండ బస్సు పున ప్రారంభించేందుకు నాయకులుకొందరు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ బస్సు విషయంలో సానుకూలంగా స్పందించిన మంత్రి బోరబండ బస్సు ను పున ప్రారంభించాలని ఆర్టీసీ అధికారుల నుండి తొర్రూర్ డిపో మేనేజర్ పద్మావతికి ఆదేశాలు అందడంతో ఆదివారం నుండి బోరబండ బస్సును పునః ప్రారంభించిన డి.ఎం.తొర్రూరు బస్టాండ్ నుండి మధ్యాహ్నం 1.30(13.30) కి బయలుదేరుతుంది. వెలిశాల, కొడకండ్ల, జనగాం,బోనగిరి, ఉప్పల్ ఎక్స్ రోడ్,సికింద్రాబాద్, బోరబండకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో తెల్లవారుజాము 3:30 కి బయలుదేరి అదే మార్గంలో తొర్రూర్ కు చేరుకుం టుంది. బోరబండ బస్సు ను ప్రారంభించినందుకు ప్రయాణికులు ఆదరించి ప్రయాణికుల సంఖ్యను పెంచుకొని పాత కాలాన్ని గుర్తు చేసుకునే విధంగా బస్సును నడిపించుకునే బాధ్యత ప్రయాణికుల పైనే ఉంటుందని అంటున్నారు. ప్రయాణికుల కోరిక మేరకు బస్సును ప్రారంభించిన తొర్రూర్ డిఎం పద్మావతికి నాయకులు, ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేయటమే కాకుండా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ బస్సు మనది మన అందరిదీ బస్సును నడిపించుకునే బాధ్యత ప్రయాణికుల పైనే ఉంది.

## ఎన్ఐటీ వరంగల్‌లో హైడ్రాలజిక్ ఎక్స్‌ట్రీమ్స్‌పై జియన్ వర్క్‌షాప్ ప్రారంభం



హన్మకొండ జులై 28(పిసిడబ్ల్యు న్యూస్): "హైడ్రాలజిక్ ఎక్స్‌ట్రీమ్స్ విశ్లేషణ మరియు నమూనాల అభివృద్ధిలో పురోగతులు" అనే అంశంపై జియన్ (గ్లోబల్ ఇనిషియేటివ్ ఆఫ్ అకడెమిక్ నెట్‌వర్క్స్) క్రింద 10 రోజుల ప్రఖ్యాత శిక్షణ కార్యక్రమం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ (ఎన్ఐటీ వరంగల్) లో జూలై 28, 2025 ఉదయం 9:30 గంటలకు ఘనంగా ప్రారంభమైంది. దేశమంతటి నుంచి వచ్చిన 61 మంది ప్రముఖ పరిశోధకులు, అధ్యాపకులు మరియు నిపుణులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నాగరిక నిర్మాణ శాఖ అధిపతి డా. కీశర వెంకట రెడ్డి సమన్వయిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ఆకర్షణగా, యుఎస్ఏ లోని వర్జీనియా టెక్ విశ్వ విద్యాలయానికి చెందిన బయాలజికల్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. వెంకటరమణ శ్రీధర్ ముఖ్య అతిథిగా మరియు విదేశీ నిపుణుడిగా హాజరయ్యారు. హైడ్రాలజిక్ మోడలింగ్, వాతావరణ భిన్నతలు మరియు జల వనరుల నిర్వహణపై తన అంతర్జాతీయ అనుభవాన్ని ఆయన ఆసక్తికరంగా పంచుకున్నారు. ప్రారంభోత్సవ సభలో ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాసరావు (డీన్ – అంతర్జాతీయ సంబంధాలు,అకడెమిక్ అఫైర్స్), మరియు ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, డైరెక్టర్, ఎన్ఐటీ వరంగల్ హాజరై, వాతావరణ మార్పుల వల్ల తలెత్తుతున్న జల సంబంధిత సవాళ్లను ఎదుర్కొనటంలో ఆధునిక హైడ్రాలజిక్ మోడలింగ్ అవసరాన్ని హైలైట్ చేశారు. ఈ ఇంటర్ డిసిప్లినరీ జియన్ కోర్స్ భారత పరిశోధకులు మరియు ప్రాక్టీషనర్లలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు లక్ష్యంగా పెట్టుకొని, వరదలు మరియు కరువు వంటి హైడ్రాలజిక్ ఎక్స్‌ట్రీమ్స్‌ను అధ్యయనం చేయటానికి ఆధునిక పద్ధతులు అందిస్తుంది. ఈ కార్యక్రమం జూలై 28 నుండి ఆగస్టు 6, 2025 వరకు కొనసాగనుంది.



# గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



**హన్మకొండ జులై 28(పిసిడబ్ల్యూ న్యూస్):** హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ పరిధిలో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు కాజిపేట్ ఏసీపీ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. సోమవారం రోజున హాసన్ పర్తి దేవేందర్, సబ్ ఇన్స్పెక్టర్, తనవెంట సిబ్బందిని తీసుకుని హసన్ పర్తి మరియు ఎల్లాపూర్ గ్రామాలలో పెట్రోలింగ్ చేయుచుండగా, ఎల్లాపూర్ గ్రామంలో హసన్‌పర్తి రోడ్ రైల్వే స్టేషన్ కు వెళ్ళు దారిలో ఒక వ్యక్తి అనుమాస్పదంగా రెండు లగేజి బ్యాగులతో వెళ్ళుచూ పోలీసు వారిని చూసి బ్యాగులతో పారిపోయే ప్రయత్నం చేయుచుండగా పట్టుకుని విచారించగా, ఆశిష్ కుమార్ నాయక్ తన వివరములు చెబుతూ అతని తండ్రి మేస్త్రి పని చేయుచుండగా, అతనితో పాటు కూలి పని చేస్తూ, అతను చేసే పని వలన సంపాదన సరిపోక అక్రమంగా నైన డబ్బులు సంపాదించాలని అనుకుని సుమారు 6 సంవత్సరముల క్రితం అతనికి పరిచయస్తుడైన జమీర్ తండ్రి శిబ ఆర్/ఓ చాందిపుట్ అతనితో గంజాయి రవాణా చేయగా ఒరిస్సా లోని బరంపుర జిల్లాలో పోలీసు వారు మమ్ములను పట్టుకుని బరంపుర లోని సర్కిల్ జైలుకు పంపించగా 9 నెలల పాటు జైలులో ఉండి, తరువాత అతనికి పరిచయస్తుడైన ప్రశాంత్ మాలిక్ ఆర్/ఓ మోహన, గండపదర్, గజపతి జిల్లా, ఒడిశా రాష్ట్రంనకు చెందిన అతని వద్ద ఒక కిలో గంజాయి 1500/- రూపాయలకు కొనుగోలు చేసి నాలుగైదు సార్లు మహారాష్ట్ర లోని షోలాపూర్ కు చెందిన మహాదేవ్ కాలే అతనికి 4500/-రూపాయలకు గంజాయి అమ్మి లాభం పొందేవాడని, అదే క్రమంలో తేది: 24-07-2025 రోజు ప్రశాంత్ మాలిక్ వద్ద అందాజ 30.290 కిలోల గంజాయి (2 కిలోల బరువు గల బ్రౌన్ టేపుతో సీల్ చేయబడిన 15 ప్యాకెట్లలో) గల గంజాయిని 45000/- రూపాయలకు కొని, వాటిని ఎవరికి అనుమానం రాకుండా ఉండేందుకు లగేజి బ్యాగులలో సర్దుకుని, తేది: 25-07-2025 రోజున ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ కు వచ్చి కోణార్క్ రైలులో తేది: 26-07-2025 రోజు వరంగల్ రైల్వేస్టేషన్ దగ్గరకు చేరుకుంటుండగా రైల్వేస్టేషన్ లో పోలీసులు రైలును తనిఖీ చేయుచున్నారని తెలుసుకుని, వెనుక భోగీలో ఉన్న అతను వరంగల్ రైల్వే స్టేషన్ లో దిగి, పోలీసులకు అనుమానం రాకుండా వరంగల్ చుట్టుప్రక్క ఏరియాలో రెండు రోజుల పాటు ఉండి, 28-07-2025 వరంగల్ రైల్వే స్టేషన్ లో పోలీసులు తనిఖీ చేస్తున్నారని తెలుసుకుని ఉదయం మహారాష్ట్రకు వెళ్ళుటకు రైల్వేస్టేషన్ గురించి అడుగగా, హసన్‌పర్తి దగ్గర రైల్వేస్టేషన్ ఉన్నదని తెలుసుకుని ఆటోలో వెళ్ళుచూ రైల్వే బ్రిడ్జి దగ్గర దిగి రోడ్డు ప్రక్కన నుండి నడుచుకుంటూ వెళ్ళే దారిలో సహాయ మాతా దేవాలయం (చర్చ్) దగ్గర, ఎల్లాపూర్ గ్రామములో పట్టుకోవడం జరిగినది. ఇట్టి స్వాధీనం చేసుకున్న 30.290 కిలోల ఎండు గంజాయి బహిరంగ మార్కెట్టులో ఒక కిలోకు రూ. 50,000/- ల చొప్పున మొత్తం రూ. 15,14,500/-ల విలువ ఉంటుందనీ పోలీసులు తెలిపారు.



# రౌడీ షీటర్ కోతి సురేష్ అరెస్ట్

**హన్మకొండ జూలై 28 (పిసిడబ్ల్యు న్యూస్):** పలు కేసుల్లో నిందితుడిగా ఉండి ప్రజలను బెదిరించి, భయ భ్రాంతులకు గురి చేస్తూ, పోలీసులకి దొరకకుండా తప్పించుకుని తిరుగుతున్న నగరంలోని కరీమాబాద్ కు చెందిన వంచనగిరి సురేష్ అలియాస్ కోతి సురేష్ అనే రౌడీషీటర్ ను సోమవారం మిల్స్ కాలనీ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్ కొరకు మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచటం 6జరిగింది. జూలై 6వ తేదీన కరీమాబాద్ బీరన్న బోనాల సందర్భంగా స్థానికంగా ఓ యువకుడి ఇంట్లో తన అనుచరులతో చొరబడి దాడి చేసిన కేసులో ఇతను నిందితుడు. అప్పటి నుండి తప్పించుకు తిరుగు తున్న అతడిని మిల్స్ కాలనీ పోలీస్‌కు సోమవారం చాకచక్యంగా అరెస్ట్ చేయటం జరిగింది. ఇతను గతములో హత్యాయత్నంతో సహా పలు దాడి కేసులలో నిందితుడు. ప్రజలను తాను రౌడీ అంటూ భయపెట్టి ఆకారంగా వారిపై దాడి చేసే తీవ్ర నేరస్వభావం కలిగినటువంటి వ్యక్తి అని తెలిపారు. ఈ సందర్భంగా మిల్స్ కాలనీ సీఐ బొల్లం రమేష్ మాట్లాడుతూ ప్రజలు ఎవరు రౌడీలకి భయపడవలసిన అవసరం లేదని, ఏ విషయం అయినా నిర్భయంగా పోలీస్ వారికి తెలియజేయాలని కోరారు. అలాగే రౌడీషీటర్ల మీద అనుక్షణం పోలిస్ వారి నిఘా ఉందని, వారు ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన దాని పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు.

# రాష్ట్ర యువజన సంఘాల అధ్యక్షుడు డా.కూన వేణుగోపాలకృష్ణను కలిసి ఘనంగా సన్మానం

**తెలంగాణ రాష్ట్రంలో యువజన సంఘాల సమితి కి పురుడు పొయ్యాలి**

**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా యువజన సామాజిక కార్యక్రమాలతో సామాజిక ఉద్యమాలకు శ్రీకారం చుడుతున్న**

**దళితరత్న డా. ఏర్పుల శ్రీనివాస్, సామాజిక ఉద్యమ నాయకుడు**

**మెట్టు శ్రీధర్, సామాజిక ఉద్యమ నాయకులు**

**యువజన సంఘాలకు స్ఫూర్తిని ఇవ్వాలని ఘనంగా సన్మానించి ఆకాంక్షించిన డా. కూన వేణుగోపాలకృష్ణ**

**రాష్ట్ర యువజన సంఘాల సమితికి పూర్వ వైభవం తీసుకొస్తామన్న నేతలు డా. ఏర్పుల శ్రీనివాస్, మెట్టు శ్రీధర్**

**యువజన సంఘాల సమితిని బలోపేతం చేయడం కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తూ మంతనాలు జరిపిన యువజన నేతలు**



**సంగారెడ్డి జిల్లా,జులై 28(పిసిడబ్ల్యూ న్యూస్):**సంగారెడ్డి జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర యువజన సంఘాల సమితి అధ్యక్షులు డా.కూన వేణుగోపా లకృష్ణను కలిసి ఘనంగా సన్మానించిన యువజన నాయకులు సామాజిక ఉద్యమ నేత జిన్నారం గ్రామానికి చెందిన దళిత రత్న డా.ఏర్పుల శ్రీనివాస్,పటాన్ చెరువు నివాసి సామాజిక ఉద్యమ నేత మెట్టు శ్రీధర్ వీరు ఇరువురు తెలంగాణ రాష్ట్ర యువజన సంఘాల సమితికి పురుడు పోయడం కోసం రాష్ట్ర యువజన సంఘాల సమితి అధ్యక్షులు డా.కూన వేణుగోపాలకృష్ణ ప్రత్యేకంగా తన కార్యాలయానికి ఆహ్వానించి యువజన సంఘాల సమితి తెలంగాణ రాష్ట్రంలో బలోపేతం చేయడం కోసం ఈ ఇరువురి యువజన నాయకులతో మంతనాలు నిర్వహించి ప్రత్యేక ప్రణాళికను సంసిద్ధం చేయడం జరిగింది, అనంతరం సామాజిక కార్యక్రమాలతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా యువజన సంఘాలకు స్ఫూర్తిగా సామాజిక కార్యక్రమాలు ప్రజా సమస్యలపై సామాజిక న్యాయపరమైన దళిత బహుజన పోరాటాలు చేపట్టి విజయాలు సాధించి రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అవార్డు పురస్కారం అందుకొని తెలంగాణ రాష్ట్రానికి ఖ్యాతిని సాధించి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును చాటుకున్న సామాజిక ఉద్యమ నాయకులు జిన్నారం గ్రామ యువజన ముద్దుబిడ్డ డా.ఏర్పుల శ్రీనివాస్, పటాన్చెరువు యువజన ముద్దుబిడ్డ అనేక సామాజిక కార్యక్రమాలకు పురుడు పోసి సామాన్యుల హక్కుల కోసం న్యాయబద్ధంగా గొంతెత్తి ప్రజల పక్షాన ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్న సామాజిక ఉద్యమ నేత మెట్టు శ్రీధర్ ను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించడం జరిగింది,అనంతరం ఈ సందర్భంగా డా.కూన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మరోసారి భారతదేశ స్వాతంత్ర ఉద్యమ సమరయోధులను, సామాజిక ఉద్యమ నేతలను స్ఫూర్తిగా తీసుకొని యువజన సంఘాల సమితిని బలోపేతం చేయడం కోసం యువతీ యువకులను ఐక్యం చేసి సామాజిక సేవతో యువతను సన్మార్గంలో నడిపించే మార్గదర్శకులు కావాలన్నారు, భారతదేశానికి భరతమాత బిడ్డలుగా సేవ చేయాలనుకునే యువతీ యువకులు కంకణ బద్ధులై సామాజిక మార్పు కోసం యువజన సంఘాల సమితి ద్వారా యువజన సంఘాల సమితి లో పనిచేయుటకు కంకణ బదులు కావాలన్నారు.సామాజిక దళిత బహుజన, యువజన ఉద్యమ నాయకులు డా.ఏర్పుల శ్రీనివాస్, సామాజిక ఉద్యమ నేత ప్రముఖ యువజన నాయకుడు మెట్టు శ్రీధర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రా యువజన సంఘాల సమితిని భారతదేశం గర్వించదగ్గ సామాజిక సేవ స్ఫూర్తిని భారత దేశ స్వాతంత్ర సామాజిక ఉద్యమ స్ఫూర్తి ప్రదాతల ఆశయ సాధన కోసం తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకుపోవడం కోసం యువతి యువకులను ఐక్యం చేసి సామాజిక కార్యక్రమాలకు పురుడుపోస్తూ దేశ ప్రగతి నీ సాధించుటకు యువజన సంఘాల ద్వారా ముందడుగు వేసి తెలంగాణ రాష్ట్ర యువజన సంఘాల సమితి ద్వారా ప్రత్యేక ఖ్యాతిని సాధించాలన్నారు. యువతి యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తెలంగాణ రాష్ట్ర యువజన సంఘాల సమితిని బలోపేతం చేయుటకు కంకణ బద్ధులై ముందుకు రావాలన్నారు, రాష్ట్రవ్యాప్తంగా మరోసారి యువజన సంఘాలకు పిలుపునిచ్చి యువజన సంఘాలను బలోపేతం చేసి సామాజిక పోరాటం ద్వారా సమాజంలో మార్పు తీసుకొస్తామన్నారు, సమాజాహితము కోరే యువతీ యువకులు యువజన సంఘాలకు పురుడు పోసి భారతదేశంలోని తెలంగాణ రాష్ట్రాన్ని గర్వించదగ్గ రాష్ట్రంగా ఖ్యాతిని సాధించాలన్నారు.

# రెచ్చిపోతున్న ఇసుక మాఫియా పోలీసులను చూసి ఇసుకను రోడ్డుపై పోసి పారిపోయిన ట్రాక్టర్ డ్రైవర్

**హుజూరాబాద్, జూలై 28(పిసిడబ్ల్యూ న్యూస్):** పోలీసులను చూసి ఇసుకను రోడ్డుపై పోసి పారిపోయిన ఘటన హుజూరాబాద్‌లో సోమవారం జరిగింది. పట్టణంలోని మామిండ్లవాడలో గుర్తుతెలియని ఓ ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ ఇసుకను తరలిస్తుండగా పోలీసు తారసపడడంతో ఇసుకను అక్కడే రోడ్డుపై పోసి పారిపోయాడు. రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. దీంతో జేసీబీని పిలిపించి అక్కడి నుంచి ఇసుకను ట్రాక్టర్ ద్వారా తహశీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్వేలన్నీ బీఆర్ఎస్ పార్టీ వైపే ఉన్నాయి



మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**హన్మకొండ జులై 28(పిసిడబ్ల్యు న్యూస్):** హసన్ పర్తి మండల బీఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ బండి రజిని అధ్యక్షతన మండల కేంద్రం లోని డి ఎస్ కె గార్డెన్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో యం పి టి సి క్లస్టర్ల వారిగా సన్నాహక సమావేశం ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈ సమావేశంలో ఎర్రబెల్లి దయాకర్ మాట్లాడుతూ సర్వేలన్నీ మన వైపే ఉన్నాయి. ఈ మండలంలో ప్రతి ఒక్క కార్యకర్తని కలుపుకొని పోయి పని చేయాలి. పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు.గడప గడపకు మన కార్యకర్త తిరిగి ఈ బోగస్ ప్రభుత్వం చేసిన బోగస్ హామీలను వాళ్లకు అర్థమయ్యే రీతిలో ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుంది. తొందర్లోనే కమిటీలు వేసి ప్రతి కార్యకర్తకి శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లని ఈ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకం ఇది ఒక మోస పూరితమైన పథకం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన బోగస్ 420 హామీల వల్లప్రజలు మోసపోయారుతెలంగాణ లో ఒక పెద్ద బ్లాక్మెయిలర్ చేతిలో ప్రభుత్వం నడవటం చాలా బాధాకరమైన విషయం. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం "రైతు భరోసా" నిధులు విడుదల చేసిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు అరిగోసలు పడుతున్నారు అన్నారు.రాష్ట్రంలో మొత్తం రాక్షస పాలన కొనసాగుతుంది. సరైన పాలన లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్వేలన్నీ బీఆర్ఎస్ పార్టీ వైపే ఉన్నాయన్నారు. పార్టీ క్యాడర్ యూత్ సోషల్ మీడియా నాయకులు ఈ ఎన్నికల్లో కష్టపడి పని చేసి మన సత్తాచాటాలి. ప్రజలు నిరుద్యోగ విద్యార్థులు, ఎన్నికల కోసం వేచి చూస్తున్నారు. ప్రజలు రేవంత్ రెడ్డి పాలనలో చాలా అసమ్మతితో ఉన్నారని వ్యక్తం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో 90% బీఆర్ఎస్ పార్టీ గెలుపొందుతామన్నారు.హసన్ పర్తి మండలం లోని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, తాజా, మాజీ ముఖ్య నాయకులు, యం పి టి సి ఇంచార్జీలు,మండలం లోని ప్రతి గ్రామ పంచాయతీ లలో యూత్, సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.



# యువత సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై లోక్‌సభలో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ



**● తెలంగాణలో యువత సాధికారతపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలి**

**హన్మకొండ జులై 28(పిసిడబ్ల్యు న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో యువత సాధికారతకు కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలపై లోక్‌సభలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ప్రశ్నించారు.యువత కు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, వ్యవస్థాపకత లక్ష్యంగా తీసుకొచ్చిన పథకాల వివరాలను తెలియ జేయలని కేంద్ర మంత్రిని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కోరారు.వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్మిక ఉపాధి మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా ఈ మేరకు సమాధానం ఇచ్చారు. రాష్ట్రీయ యువ సశక్తికరణ్ కార్యక్రమ్, నేషనల్ సర్వీస్ స్కీమ్ మరియు భారత్ వంటి కార్యక్రమాలు తెలంగాణలో అమలవుతున్నాయని వివరించారు. భారత్ 2025-26 వార్షిక ప్రణాళికలో భాగంగా వరంగల్ సహా రాష్ట్రంలోని జిల్లాల్లో "ఏక్ పెడ్ మా కే నామ్", "స్కిల్స్ ఫర్ సక్సెస్", "జిల్లా స్థాయి క్రీడా పోటీలు", "విక్షిత్ భారత్ - యువ ఉత్సవ్" లాంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇక తాజాగా ప్రకటించిన 2 లక్షల కోట్ల ప్రధానమంత్రి ప్యాకేజీ ద్వారా ఐదేళ్లలో 4.1 కోట్ల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. ఖేలో ఇండియా", "ఫిట్ ఇండియా", "పిఎమ్ఈజీపీ", "స్కిల్ ఇండియా మిషన్" వంటి జాతీయ పథకాలను తెలంగాణ రాష్ట్రంలో మరింత వేగవంతం చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతిభ కలిగిన యువత ఉన్నారని తెలిపారు. వారికి సరైన అవకాశాలు కల్పిస్తే, వారు జాతీయ అభివృద్ధికి దోహద పడతారని తెలియజేశారు. రాష్ట్ర యువతకు ప్రాముఖ్యత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు.